STV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/26/A3949

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 67 | ఎడిటర్ : అలీ ముర్తుజా | బుధవారం 9 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

## సైకిలెక్కిన బొత్స మేనల్లుడు!

టీడీపీలో చేరిన విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

వైసీపీ జిల్లా అధ్యక్ష పదవికి ఆకస్మిక రాజీనామా

2



## అంతిమ విజయం సత్యానిదే!

యువత సత్యమార్గంలోనే నడుస్తోంది

ప్రజా భాగస్వామ్యంతోనే శాశ్వత మార్పు

ప్రజాసేవే అధికారానికి పరమార్థం

ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం



4

## తరం మారింది..

# తీరు మారాలి!

## అసత్యాలను దీటుగా ఎదుర్కోవాలి!




- సామాజిక మాధ్యమాలను మరింత బలంగా వినియోగించుకోవాలి
- ప్రతి నియోజకవర్గంలో 25 ప్రాధాన్య అంశాలపై ప్రత్యేక దృష్టి
- టీడీపీ నాయకత్వ సదస్సులో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- నాయకులు భారం కాకుండా ఆస్తిగా మారాలన్న నారా లోకేశ్
- నేడు 53 దీపాలతో 'నిజం గెలిచింది' కార్యక్రమం
- 2029 ఎన్నికల కోసం ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపు

**మంగళగిరి (సమయం న్యూస్):** పదేళ్లకో కొత్త తరం వస్తుందని, మారుతున్న యువత ఆకాంక్షలకు అనుగుణంగా నాయకుల పనితీరు, ఆలోచనా విధానం మారాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మారుతున్న కాలాన్ని అందిపుచ్చుకుంటూ ప్రతి ప్రజాప్రతినిధి పార్టీకి భారం కాకుండా ఆస్తిగా మారాలని, ఇదే 'టీడీపీ వెర్షన్ 3.0' అని మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు 2029 సార్వత్రిక సమరానికి ఇప్పటి నుంచే పార్టీని సన్నద్ధం చేసే లక్ష్యంగా టీడీపీ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో తొలిసారిగా కార్పొరేట్ తరహాలో రెండు రోజుల నాయకత్వ సదస్సును నిర్వహించింది. ఈ కార్యశాలలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొనగా.. చంద్రబాబు, లోకేశ్ వారికి సుదీర్ఘంగా దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో కేవలం డబ్బు మాత్రమే విజయాన్ని సాధించిపెట్టదని, ప్రజలు, పార్టీ క్యాడర్‌తో

మిగతా 2 లో

## టీచర్ల నియామకాల్లో అర్హతలేనివారికి 'నో ఎంట్రీ'

- నిర్దేశిత అర్హతలు తప్పనిసరి
- సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు





## ప్రధాని భద్రతలో కలకలం

మోదీ కార్యక్రమంలో నకిలీ గుర్తింపు కార్డుతో యువకుడు

వెంట వచ్చిన వ్యక్తి వద్ద తుపాకీ

ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు

.. వివరాలు 4లో




## ఐక్యరాజ్యసమితి కొత్త మ్యాప్

.. వివరాలు 4లో

## ఖాళీ స్థలాల్లో హరిత వనాలు!

పరిశ్రమల యాజమాన్యాలకు నాగబాబు పిలుపు

మియావాకి పద్ధతిలో దట్టమైన అడవుల పెంపకం

కాకినాడ జిల్లా దివీస్ ల్యాబ్స్‌లో ఏపీ గ్రీన్ చైర్మన్ పర్యటన



.. వివరాలు 2లో



## శ్రీవారి భక్తులకు వెన్నుపోటు!

- హిందువుల మనోభావాలతో చంద్రబాబు ఆటలు
- టౌన్‌షిప్ పేరుతో ఇనాం భూముల బదలాయింపు
- టీటీడీ నిర్ణయాలపై భూమన కరుణాకర్ రెడ్డి ఫైర్

శ్రీవారి భక్తుల విశ్వాసాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆడుకుంటున్నారని వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ముంతాజ్ హోటల్‌కు ఇచ్చిన భూమిని రద్దు చేస్తున్నట్లు పైకి చెబుతూనే, ఆ స్థలంలో టీటీడీ టౌన్‌షిప్ కట్టకుండా స్వర హోటల్‌గా పేరు మార్చి సుమారు రూ. 3 వేల కోట్ల విలువైన ఇనాం భూముల్ని కట్టబెట్టడం దారుణమన్నారు.

## రూ. 32కే కిలో ఉల్లి!

నిత్యావసరాల ధరల తగ్గింపుపై ఏపీ సర్కారు ఫోకస్

115 రైతు బజార్లు, మొబైల్ కౌంటర్ల ద్వారా విక్రయాలు

చౌకడిపోల్లో రాయితీపై కందిపప్పు, పామాయిల్

ఢిల్లీ పర్యటనలో మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

3



3

## ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు!

కొత్త పెన్షన్ల దరఖాస్తులపై మంత్రి కందుల దుర్గేష్ సమీక్ష

పత్రాలు లేకున్నా దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు ఆదేశం




# నేడు కోనసీమకు ముఖ్యమంత్రి!

**డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సీఎం పర్యటన**

**'మీ భూమిఉమీ హక్కు' కింద పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ**

**22-ఏ జాబితా నుంచి గ్రౌండ్ రెంట్ స్థలాల తొలగింపు**

**అమరావతి (సమయం న్యూస్):** ప్రజల మధ్యే పాలన సాగిస్తూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే నిజమైన పాలన అనే విధానంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆయన పర్యటించనున్నారు. భూ హక్కులకు భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'మీ భూమిఉ మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొంటారు. పండువారిపేటలో జరిగే గ్రామసభలో పాల్గొని పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తారు.




## ప్రజల మధ్యే పాలన..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి నెలా ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవలో', మూడో శనివారం 'స్వర్ణాంధ్రఉస్వచ్ఛాంధ్ర', నాలుగో శనివారం 'సంజీవని', ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమిఉమీ హక్కు' కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గత ప్రభుత్వంలో రీ-సర్వే ప్రక్రియలో తలెత్తిన సమస్యలను పరిష్కరించి, భూ రికార్డులను సరిచేసి ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కును కల్పించేందుకు 'రీ-సర్వే 2.0' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 8,234 గ్రామాల్లో 36 లక్షలకు పైగా పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ చేపట్టారు. ఈ నెలలో మరో 783 గ్రామాల్లో దాదాపు 4 లక్షల పాస్‌పుస్తకాలు పంపిణీకి సిద్ధం చేశారు. వచ్చే మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 8,582 గ్రామాల్లో 56 లక్షలకు పైగా పుస్తకాలను అందించి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు.

## గ్రౌండ్ రెంట్ భూముల సమస్యకు పరిష్కారం..

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కోనసీమ జిల్లాలో దశాబ్దాలుగా కొనసాగుతున్న గ్రౌండ్ రెంట్ స్థలాల సమస్య పరిష్కారానికి కీలక అడుగు పడనుంది. అమలాపురం, అంబాజీపేట, ముమ్మిడివరం, రామచంద్రాపురం ప్రాంతాల్లోని కొన్ని నివాస గ్రౌండ్ రెంట్ స్థలాలు రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఏ(1)(బి) కింద నిషేధిత ఆస్తుల జాబితాలో కొనసాగుతున్నాయి. 1984 నుంచే గ్రౌండ్ రెంట్ వ్యవస్థ నిలిచిపోయినప్పటికీ, ఆయా కుటుంబాలు ఆస్తి లావాదేవీల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వీటిని గ్రామకంఠం భూములతో సమానంగా పరిగణించి 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఈ నిర్ణయం అమలైతే 1,416 మంది నివాసితులకు ప్రయోజనం చేకూరడంతో పాటు 56.37 ఎకరాల భూమి, 1,281 సర్వే నంబర్లకు ఆంక్షల నుంచి విముక్తి లభించనుంది. మాచవరం గ్రామంలోని జయంతినగర్‌లో గుర్తించిన 32 మందికి కూడా ప్రయోజనం కలగనుంది.

## ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్..

ఉదయం 9.45 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి కోనసీమ జిల్లాకు సీఎం బయలుదేరుతారు. 10.30 గంటలకు అంబాజీపేట మండలం ఇరుసుమండ చేరుకుంటారు. 10.55 నుంచి 11.35 గంటల వరకు మాచవరం జయంతి నగర్‌లో రైతులతో ముఖాముఖి అవుతారు. 11.40 నుంచి మధ్యాహ్నం 1.55 గంటల వరకు పండువారిపేట గ్రామసభలో పాల్గొని పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 3.15 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు బుడుంగపేటలో కేడర్ సమావేశంలో పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు. సాయంత్రం 5.40 గంటలకు తిరిగి ఉండవల్లికి చేరుకుంటారు.

# సీఎంను కలవనున్న దస్తగిరి!

**వివేకా హత్య కేసులో అప్రూవర్‌కు అధికారుల వేధింపులు**

**సీఎం అపాయింట్‌మెంట్ కోరిన దస్తగిరి దంపతులు**

**జగన్‌కు సవాల్.. మనీ లాండరింగ్ వివరాలు బాబుకు ఇస్తానని వెల్లడి**

**అమరావతి (సమయం న్యూస్):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసేందుకు మంగళవారం అమరావతికి చేరుకున్నారు. గత ప్రభుత్వంలో తనను వేధించిన అధికారులే ఇప్పటికీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎంకు వినతిపత్రం సమర్పించేందుకు ఆయన వచ్చారు. తన భార్య షబానాతో కలిసి వచ్చిన దస్తగిరి.. సీఎం అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నట్లు మీడియాతో చెప్పారు. వివేకా హత్య కేసు, దానికి సంబంధించిన మనీ లాండరింగ్ వ్యవహారాలపై తన వద్ద ఉన్న కీలక వివరాలను సీఎం చంద్రబాబుకు అందజేస్తానని దస్తగిరి స్పష్టం చేశారు.



## నిరూపిస్తే జైలుకు వెళ్తా..

ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాను న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా నుంచి వకాల్తా తీసుకున్నట్లు నిరూపిస్తే తాను జైలుకు వెళ్లేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. ఒకవేళ నిరూపించలేకపోతే జగన్ రాజకీయాల నుంచి తప్పుకుంటారా అని ప్రశ్నించారు. రాష్ట్రం గురించి మాట్లాడే ముందు సొంత బాబాయ్ కూతురికి జగన్ న్యాయం చేయాలని హితవు పలికారు. వివేకా హత్య కేసులో జగన్, ఆయన భార్య భారతి విచారణ సంస్థలకు పూర్తిగా సహకరించాలని డిమాండ్ చేశారు. నైతిక విలువల గురించి తాను జగన్‌కు చెప్పాల్సిన పరిస్థితి రావడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తనను చంపేస్తామని బెదిరించిన అధికారులే, ఇప్పటికీ తన వెంటపడుతున్నారని దస్తగిరి ఆవేదన వ్యక్తం చేశారు. వారి వేధింపులు భరించలేకే ముఖ్యమంత్రికి మొరపెట్టుకునేందుకు వచ్చామన్నారు. దస్తగిరి భార్య షబానా మాట్లాడుతూ.. తాము పులివెందులకు వెళ్లాలంటేనే భయంగా ఉందని కన్నీటిపర్యంతమయ్యారు. తమ కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, న్యాయం పొందాలనే ఆశతోనే అమరావతికి వచ్చామని, సీఎంను కలిసేందుకు అనుమతి ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# తరం మారింది.. తీరు మారాలి!

(మొదటిపేజీ తరువాయి..)

నాయకులు పెనవేసుకునే ఆత్మీయ అనుబంధమే గెలిపిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తేల్చిచెప్పారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో సమస్యలను వేగంగా పరిష్కరించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో 25 ప్రాధాన్య అంశాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయతను పెంపొందించుకోవచ్చని సూచించారు. ఇకపై ప్రతి మూడు నెలలకోసారి ఇలాంటి సదస్సులు ఉంటాయన్న సీఎం.. ఉత్తమ పనితీరు కనబరిచిన ఎమ్మెల్యేలకు తదుపరి సమావేశాల్లో మాట్లాడే అవకాశం ఇస్తామని ప్రకటించారు. 2024 బ్యాచ్ నేతలు 'అత్యుత్తమ నాయకులు' అనిపించుకునే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.




## అసత్యాలపై సెల్ఫీ అస్త్రాలు..

ప్రభుత్వ పనితీరు లోపించడం పార్టీకి సమస్య కాదని, చేస్తున్న మంచిని ప్రజలకు చేరవేయడంలో వెనుకబడటమే అసలు సమస్య అని నారా లోకేశ్ విశ్లేషించారు. ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ తరహాలో ప్రజాప్రతినిధులు కూడా సులభంగా ప్రజలకు చేరువయ్యేలా సెల్ఫీ వీడియోలు చేయాలని సూచించారు. సుజ్లాన్ ప్రాజెక్టులు, డీఎస్సీపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు తాను చేసిన వీడియోలను ఉదాహరణగా చూపించారు. స్కిల్ డెవలప్‌మెంట్, డీఎస్సీ అంశాలపై తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని.. మద్యం, ఏపీపీఎస్సీ కుంభకోణాలు, వివేకా హత్య కేసులపై సమాధానం చెప్పేందుకు జగన్ సిద్ధంగా ఉన్నారా అని లోకేశ్ ఇదే వేదికగా సవాల్ విసిరారు.

## నేడు 53 దీపాలతో 'నిజం గెలిచింది'..

సీఎం చంద్రబాబు నాయుడు 53 రోజుల జైలు జీవితాన్ని గుర్తుచేస్తూ పార్టీ శ్రేణులకు నారా లోకేశ్ కీలక పిలుపునిచ్చారు. సోమవారం ప్రతి బూత్, ప్రతి నియోజకవర్గంలో 53 దీపాలు వెలిగించడంతో పాటు, 'నిజం గెలిచింది' పోస్టర్లను విస్తృతంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఆ రోజును 'బ్లాక్ డే'గా పాటించాలని సూచించారు. కాగా, పార్టీలో అంతర్గత చర్చలు ఎంతైనా జరగవచ్చని, కానీ చంద్రబాబు తీసుకునే తుది నిర్ణయానికి మాత్రం ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని లోకేశ్ స్పష్టం చేశారు. నాయకులు తమ బలహీనతలను గుర్తించి సరిదిద్దుకోవాలని, ప్రజా సమస్యలను స్వయంగా పరిష్కరించే బాధ్యత తీసుకోవాలని ఆయన హితవు పలికారు

# సైకిలెక్కిన బొత్స మేనల్లుడు!

- **టీడీపీలో చేరిన విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు**
- **వైసీపీ జిల్లా అధ్యక్ష పదవికి ఆకస్మిక రాజీనామా**
- **కండువా కప్పి ఆహ్వానించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి (సమయం న్యూస్):** ఉత్తరాంధ్రలో వైసీపీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆయన పసుపు కండువా కప్పుకున్నారు. మజ్జి శ్రీనివాసరావుతో పాటు ఆయన కుమార్తె సిరి సహస్ర కూడా పార్టీలో చేరగా.. సీఎం చంద్రబాబు ఆమెకు సైతం కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరడానికి ముందు మజ్జి శ్రీనివాసరావు వైసీపీకి రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు తాను నిర్వహిస్తున్న విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు పంపించారు. బొత్స కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, జిల్లా పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా వ్యవహరించే చిన్న శ్రీను ఆకస్మికంగా ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో కీలకమైన జడ్పీ చైర్మన్ పదవిలో ఉన్న ఆయన పార్టీని వీడటం వైసీపీకి తీవ్ర నష్టమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చేరికల కార్యక్రమంలో మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, మాజీ మంత్రులు కళావెంకట్రావు, కోండ్రు మురళీ, సుజయ్ కృష్ణ రంగారావు, ఎంపీ అప్పలనాయుడుతో పాటు పలువురు జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఖాళీ స్థలాల్లో హరిత వనాలు!

**పరిశ్రమల యాజమాన్యాలకు నాగబాబు పిలుపు**

**మియావాకి పద్ధతిలో దట్టమైన అడవుల పెంపకం**

**కాకినాడ జిల్లా దివీస్ ల్యాబ్స్‌లో ఏపీ గ్రీన్ చైర్మన్ పర్యటన**



**కాకినాడ (సమయం న్యూస్):** పర్యావరణ పరిరక్షణ కోసం పరిశ్రమలు తమ ఖాళీ స్థలాలను హరిత వనాలుగా మార్చాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు స్పష్టం చేశారు. స్థానిక వృక్ష జాతులతో దట్టమైన పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడి గ్రామంలోని దివీస్ లేబొరేటరీస్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. పరిశ్రమలో కొనసాగుతున్న గ్రీన్ బెల్ట్ అభివృద్ధి, ప్లాంటేషన్ కార్యక్రమాలపై సమీక్షించారు.

## మియావాకి పద్ధతిలో వనాలు..

పరిశ్రమలు తమ పరిధిలోని ఖాళీ ప్రదేశాలను వినియోగించుకుని గ్రీన్ బెల్ట్‌ను విస్తరించాలని నాగబాబు సూచించారు. పెద్దగా పెరిగే స్థానిక చెట్లకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. అనుకూలమైన ప్రతి చోట మియావాకి పద్ధతిలో దట్టమైన వనాలను పెంచాలన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేసినప్పుడే పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. ఖాళీ స్థలాలన్నింటినీ దశలవారీగా హరిత వనాలుగా మార్చాలని, నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని యాజమాన్యాలకు దిశానిర్దేశం చేశారు.

## ఉద్యోగులతో కలిసి..

దివీస్ పరిశ్రమ ప్రాంగణంలో ఇప్పటికే అభివృద్ధి చేసిన గ్రీన్ బెల్ట్‌ను నాగబాబు పరిశీలించారు. భవిష్యత్‌లో హరిత ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అనువైన ఖాళీ స్థలాలను పరిశీలించారు. అనంతరం దివీస్ లేబొరేటరీస్‌కు చెందిన 100 మందికి పైగా ఉద్యోగులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఇప్పటి వరకు ప్రాంగణంలో 25,150 మొక్కలను నాటినట్లు ప్రతినిధులు ఆయనకు వివరించారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవల కోసం కేటాయిస్తున్న సీఎస్ఆర్ నిధులు, వాటి వినియోగంపై నాగబాబు అడిగి తెలుసుకున్నారు.

# రూ. 32లకే కిలో ఉల్లి!

- **నిత్యావసరాల ధరల తగ్గింపుపై ఏపీ సర్కారు ఫోకస్**
- **115 రైతు బజార్లు, మొబైల్ కౌంటర్ల ద్వారా విక్రయాలు**
- **చౌకడిపోల్లో రాయితీపై కందిపప్పు, పామాయిల్**
- **ఢిల్లీ పర్యటనలో మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**


**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాల ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సామాన్యులకు ఊరట కల్పించేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటన అనంతరం మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 115 రైతు బజార్లతో పాటు మొబైల్ కౌంటర్ల ద్వారా కిలో ఉల్లిపాయలను రూ. 32లకే అందించేందుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. కేంద్ర పౌర సరఫరాల శాఖ, ఎన్.సి.సి.ఎఫ్. అధికారులతో జరిగిన భేటీలో రాష్ట్రానికి రాయితీ ధరల్లో ఉల్లి, కందిపప్పు, పామాయిల్ అందించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

## బహిరంగ మార్కెట్ కంటే 30 శాతం తక్కువకే..

వచ్చే వారం నుంచి కేంద్ర ధరల స్థిరీకరణ నిధులతో రాయితీపై కిలో ఉల్లిపాయలు రూ. 32లకే అందిస్తామన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచించిన విధంగా మొబైల్ కౌంటర్ల ద్వారా తక్కువ ధరలకే ఉల్లి విక్రయిస్తామని తెలిపారు. ఉల్లిపాయలతో పాటు 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందిపప్పు, 86,400 కిలో లీటర్ల పామాయిల్‌ను రాయితీ ధరలకే 1.46 లక్షల కుటుంబాలకు రేషన్ షాపుల ద్వారా అందించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. బహిరంగ మార్కెట్ కంటే 30 శాతం తక్కువ ధరలకే నాణ్యమైన సరుకులు అందజేస్తామని, ప్రతి కార్డుదారుడికి కిలో కందిపప్పు ఇస్తామని మంత్రి తెలిపారు.

## దేశానికే ఆదర్శంగా ఏపీ నమూనా..

చౌక డిపోల ద్వారా ప్రజలకు అందించే బియ్యంలో నూకల శాతాన్ని 10 శాతానికి తగ్గించి ఇవ్వడం ద్వారా బియ్యం వినియోగం పెరుగుతుందని భావించి, ఆ విధానాన్ని ఏపీలో పైలట్ ప్రాజెక్టుగా విజయవంతంగా అమలు చేశామని మంత్రి తెలిపారు. దీన్ని కేంద్రం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేసేలా వచ్చే నెల నుంచి ఆదేశాలు ఇవ్వనుందన్నారు. బియ్యం వినియోగం పెంచేందుకు రాష్ట్రం అనుసరించిన విధానం దేశమంతటికీ ఆదర్శంగా నిలవడం గర్వకారణమన్నారు. వినియోగదారులకు తక్కువ ధరలకే సరుకులు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న 1000 'మీ మార్టు'లను ఎన్.సి.సి.ఎఫ్.తో అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. మీ మార్టులు సిద్ధమయ్యాక ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రారంభిస్తామన్నారు. వచ్చే ఖరీఫ్‌లో 35 నుంచి 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు. రికార్డు స్థాయిలో 24 గంటల్లోపే ధాన్యం సొమ్ములు చెల్లించిన ప్రభుత్వం.. దాన్ని ఇకముందూ కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.



# శ్రీవారి భక్తులకు వెన్నుపోటు!

- హిందువుల మనోభావాలతో చంద్రబాబు ఆటలు
- టౌన్‌షిప్ పేరుతో ఇనాం భూముల బదలాయింపు
- టీటీడీ నిర్ణయాలపై భూమన కరుణాకర్ రెడ్డి ఫైర్

**తిరుపతి (సమయం న్యూస్):** శ్రీవారి భక్తుల విశ్వాసాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆడుకుంటున్నారని వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ముంతాజ్ హోటల్‌కు ఇచ్చిన భూమిని రద్దు చేస్తున్నట్లు పైకి చెబుతూనే, ఆ స్థలంలో టీటీడీ టౌన్‌షిప్ కట్టకుండా స్వర హోటల్‌గా పేరు మార్చి సుమారు రూ. 3 వేల కోట్ల విలువైన ఇనాం భూముల్ని కట్టబెట్టడం దారుణమన్నారు. దశాబ్దాల క్రితం స్వామివారికి లభించిన ఇనాం భూముల్ని కారుచౌకగా స్వర హోటల్‌కు అప్పగించడం ద్వారా భక్తులకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## మనోభావాలతో ఆటలు..

కోట్లాది మంది హిందువుల విశ్వాసాల్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం, ఇప్పుడు ఆ భక్తుల మనోభావాలకు తూట్లు పొడుస్తోంది. తిరుపతి జూపార్క్ అవతల ఉన్న 580, 604 సర్వే నంబర్లలోని స్థలం పవిత్రతను కాపాడతామని, భక్తి



పారవశ్యత ఉట్టిపడే కార్యక్రమాలకే దాన్ని వినియోగిస్తామని 2024 నవంబర్ 18న టీటీడీ తీర్మానం చేసింది. 2025 మే 7న జరిగిన బోర్డు సమావేశంలో దీన్ని ఆమోదించారు. ఆ స్థలంలో భక్తుల కోసం టౌన్‌షిప్ ఏర్పాటు చేయాలని, బేస్ క్యాంప్ ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదించారు. టీటీడీ ఇనాం భూమి 588/ఏను టూరిజం స్థలంతో బదలాయించాలని తీర్మానించారు. గతంలో ముంతాజ్ హోటల్‌కు ఇచ్చిన స్థలాన్ని రద్దు చేసి అక్కడ టౌన్‌షిప్ నిర్మిస్తామని టీటీడీ ప్రకటించింది.

## జీవోల మతలబు..

2025 ఆగస్టు 7న ప్రభుత్వం ఈ మేరకు జీవో 22 విడుదల చేసింది. అదే రోజు పర్యాటక భూమి అయిన దీనికి బదులుగా, స్వర హోటల్‌గా పేరు మార్చుకున్న ముంతాజ్ హోటల్‌కు టీటీడీ భూమి ఇచ్చేలా ప్రభుత్వం జీవో 21 కూడా ఇచ్చింది. దీనిపై తిరుపతిలోని పలువురు ప్రముఖులు, ప్రజలతో పాటు బోర్డు మాజీ చైర్మన్‌గా నేను కూడా అభ్యంతరం చెప్పాను. కానీ 2025 జూలై 22న నిర్ద్వంద్వంగా ఈ అభ్యంతరాల్ని తిరస్కరించారు. ఆ తర్వాత 2025 డిసెంబర్ 2న ఏపీటీఏ, టీటీడీ ఉమ్మడి ఒప్పందం ద్వారా ఈ భూమిని మార్చుకున్నాయి. డిసెంబర్ 13వ తేదీన ఈ భూమిని ఒబెరాయ్ ముంతాజ్ హోటల్ వాళ్లకు అప్పగిస్తూ ప్రభుత్వం అధికారికంగా జీవో విడుదల చేసింది.

## టౌన్‌షిప్ నిర్ణయం వెనక్కి..

ముంతాజ్ హోటల్ స్థలం రద్దు వ్యవహారం అంతా ఓ బూటకం. మొదట టీటీడీ తీర్మానం ప్రకారం రద్దు చేసిన ఆ స్థలంలో టౌన్‌షిప్ ఏర్పాటు చేయాలి కాబట్టి ఆ స్థలాన్ని వెనక్కి తీసుకుంది. కానీ అదే నెల 16న జరిగిన టీటీడీ బోర్డు భేటీలో టౌన్‌షిప్ ఏర్పాటు నిర్ణయాన్ని అనూహ్యంగా వెనక్కి తీసుకున్నారు. శిల్ప కళాశాల వద్దే ఆ టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తామని కొత్త తీర్మానం చేశారు. అంటే ముంతాజ్ హోటల్ స్థలంలో టౌన్‌షిప్ కట్టాలనే ఉద్దేశం వారికి ఏమాత్రం లేదు. భక్తులకు ద్రోహం చేయడానికే ఈ నాటకం ఆడారు. ప్రత్యామ్నాయంగా అలిపిరి పాదాలకు అతి సమీపంలో ఉన్న అత్యంత విలువైన 3 వేల కోట్ల రూపాయల టీటీడీ ఇనాం భూమిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. దీని మీద ఎన్ని అభ్యంతరాలు చెప్పినా ప్రభుత్వం ఖాతరు చేయలేదు. ఈ ఏడాది జూన్‌లో స్వర హోటల్ వద్ద పైపులైన్ తీసేయడానికి, ఎర్ర చందనం చెట్లు కొట్టేయడానికి ఏకంగా అనుమతులు ఇస్తూ జీవో కూడా ఇచ్చారని భూమన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు!

- కొత్త పెన్షన్ల దరఖాస్తులపై మంత్రి కందుల దుర్గేష్ సమీక్ష
- పత్రాలు లేకున్నా దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు ఆదేశం
- నిడదవోలులో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలతో భేటీ



**నిడదవోలు (సమయం న్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని, అధికారులు ఆ దిశగా జవాబుదారీతనంతో వ్యవహరించాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మంగళవారం నిడదవోలు రోటరీ క్లబ్ హాల్‌లో నిడదవోలు మున్సిపాలిటీ, నిడదవోలు రూరల్, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన రెవెన్యూ, పంచాయతీరాజ్, సంక్షేమ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మార్గదర్శకాల ప్రకారం నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి సామాజిక పెన్షన్లు అందేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి సూచించారు.

## వెంటనే వెనక్కి పంపొద్దు..

కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే పేద ప్రజల వద్ద కొన్ని పత్రాలు తక్షణమే లేకపోయినప్పటికీ వారి అప్లికేషన్లను మానవతా దృక్పథంతో స్వీకరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ప్రభుత్వం నిబంధనలను సడలిస్తే ఈ దరఖాస్తులు ఉపయోగపడతాయన్నారు. నిర్దేశిత నిబంధనలు చేరుకోలేదనే నెపంతో దరఖాస్తులను వెంటనే పక్కనబెట్టడం, వెనక్కి పంపడం చేయకూడదని స్పష్టం చేశారు. చిన్న చిన్న లోపాలు ఉన్నా సానుకూలంగా పరిశీలించి న్యాయం చేసేలా చూడాలని సూచించారు.

## తిరస్కరిస్తే కారణం చెప్పాలి..

ఒకవేళ నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా ఉండి అప్లికేషన్‌ను తిరస్కరించాల్సి వస్తే, దానికి గల కచ్చితమైన కారణాన్ని దరఖాస్తుదారునికి స్పష్టంగా వివరించాలని మంత్రి పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న లేదా సాంకేతిక సడలింపులు అవసరమైన దరఖాస్తుదారుల ఫోన్ నంబర్లు తీసుకుని నమోదు చేసుకోవాలని చెప్పారు. ఒకవేళ ప్రభుత్వం నుంచి ఏదైనా సడలింపు వస్తే వెంటనే సంబంధిత దరఖాస్తులను పరిశీలించి, వాటిని ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి లబ్ధి చేకూర్చాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తోందని మంత్రి కందుల దుర్గేష్ ఉద్ఘాటించారు.

# తిరుమలలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం!

- బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీవారి ఆలయ శుద్ధి
- ఆనందనిలయం నుంచి బంగారు వాకిలి వరకు పరిమళ జలాల ప్రోక్షణం
- పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో



**తిరుమల (సమయం న్యూస్):** తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అత్యంత వైభవంగా జరిగింది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఆలయ



అర్చకులు, సిబ్బంది ఈ ఆలయ శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. సెప్టెంబరు 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు అదనపు ఈవో తెలిపారు. బ్రహ్మోత్సవాలు, ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పుతో పాటు పూజాసామగ్రిని శుద్ధి చేశారు.

## సుగంధ ద్రవ్యాలతో ప్రోక్షణం..

ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఈ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి వేశారు. శుద్ధి పూర్తయిన అనంతరం నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలతో కూడిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజలు, నైవేద్య కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తరువాత భక్తులను దర్శనానికి అనుమతించారు.

# ఫిన్‌టెక్ రంగానికి నాలుగు సూత్రాలు!

**గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్-2026లో ప్రధాని మోదీ**

**విజయవంతమైన నమూనాగా మన యూపీఐ**

**వేగంగా పరుగులు తీస్తున్న 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్'**



**ముంబై (సమయం న్యూస్):** భారత ఫిన్‌టెక్ రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, మన యూపీఐ విజయవంతమైన నమూనాగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. దేశంలో సంస్కరణల పరంపర ఆగదని, భారతదేశపు 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' మరింత వేగంగా ముందుకు సాగుతుందని ఆయన ఉద్ఘాటించారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌ఉ 2026 ప్రారంభోత్సవంలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఫిన్‌టెక్ రంగానికి సంబంధించి నాలుగు ముఖ్యమైన ప్రాధాన్యతలను మోదీ సూచించారు. మన యూపీఐని ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని మోదీ పిలుపునిచ్చారు. ఫిన్‌టెక్ సేవలను కేవలం చెల్లింపులకే పరిమితం చేయకుండా రుణాలు, బీమా, పొదుపు, పెట్టుబడులు, పెన్షన్ల వంటి వాటికి కూడా విస్తరించాలని సూచించారు. ఏజెంటిక్ ఏఐ, టోకనైజేషన్, క్వాంటం టెక్నాలజీలను విరివిగా వినియోగించుకోవాలన్నారు. అత్యున్నత సైబర్ భద్రతతో పాటు నైతిక డేటా పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. వినియోగదారుల రక్షణను బలోపేతం చేస్తూనే సరికొత్త ఆవిష్కరణలకు మరింతగా అవకాశం కల్పించాలని ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారు.

# రూ. 5 వేల కోట్ల సైబర్ మోసాలకు బ్రేక్!

**ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ తో కేంద్రం విజయం**

**2025 మే నుంచి 2026 ఆగస్టు వరకు 15 నెలల్లో అడ్డుకట్ట**

**డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌లో 1,600 సంస్థల భాగస్వామ్యం**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** డిజిటల్ ఆర్థిక మోసాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవడంలో కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ (ఐశీ) సత్ఫలితాలు సాధిస్తోంది. ఇందుకోసం రూపొందించిన 'ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్' (ఫీ=×) ద్వారా కేవలం 15 నెలల కాలవ్యవధిలో (2025 మే 22 నుంచి 2026 ఆగస్టు వరకు) రూ. 5,043.73 కోట్ల ప్రజల సొమ్మును రక్షించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2025 మే 22న ప్రారంభమైన ఈ వ్యవస్థ ద్వారా దాదాపు రూ. 5 వేల కోట్లకు పైగా అనుమానాస్పద సైబర్ మోసపు లావాదేవీలను నిరోధించారు. డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ (ఐఖ్రా) కింద పనిచేసే ఎఫ్ఆర్ఐ వ్యవస్థ ద్వారా తొలి ఆరు నెలల్లో రూ. 660 కోట్ల మేర సైబర్ మోసాలను నిరోధించగలిగారు. ఆ తర్వాత బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఈ వ్యవస్థను విస్తృతంగా వినియోగించడంతో మోసాల నివారణ ఏకంగా ఎనిమిది రెట్లు పెరిగింది. సైబర్ నేరగాళ్లు బ్యాంకుల నుంచి డబ్బు కొట్టేసే ముందే లావాదేవీలను పసిగట్టి, ఆపేసేందుకు ఈ టెలికాం నిఘా వ్యవస్థ ఉపయోగపడుతోంది.

## 1,600కు పైగా సంస్థల భాగస్వామ్యం..

సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌లో ప్రస్తుతం 1,600కు పైగా సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. ఇందులో టెలికాం ఆపరేటర్లు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, న్యాయభద్రతా సంస్థలు ఉన్నాయి. ఈ అత్యాధునిక వ్యవస్థ పనితీరుపై అవగాహన కల్పించేందుకు 1,500 బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, ఇతర నియంత్రణ సంస్థల కోసం ఇప్పటివరకు 25కు పైగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించినట్లు టెలికాం శాఖ వెల్లడించింది. రాబోయే రోజుల్లో ఈ వ్యవస్థను బ్యాంకింగ్ రంగం దాటి ఇన్సూరెన్స్, పెన్షన్, సెక్యూరిటీ మార్కెట్లకూ విస్తరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

# సెప్టెంబర్ 22న జాతీయ అవార్డుల ప్రదానం!

**గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో వేడుకలు**

**రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం**

**2024 ఏడాదికి గాను ప్రతిభావంతులకు సత్కారం**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ అవార్డులను సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని ఏక్తా నగర్ (కేవడియా)లో భారత రాష్ట్రపతి ప్రదానం చేయనున్నారు. 2024 సంవత్సరానికిగాను భారతీయ సినిమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులు, సాంకేతిక నిపుణులకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులు అందజేయనున్నారు. ఈ దఫా జాతీయ అవార్డుల్లో 'ఆర్టికల్ 370' ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా నిలవగా, 'భంగార్' ఉత్తమ నాన్-ఫీచర్ ఫిల్మ్‌గా ఎంపికైంది. ఉత్తమ నటులుగా మమ్ముట్టి ('బ్రహ్మయుగం'), కార్తిక్ ఆర్యన్ ('చందు ఛాంపియన్') ఎంపికయ్యారు. 'ఆర్టికల్ 370' చిత్రంలో నటనకు గాను యామీ గౌతమ్ ఉత్తమ నటి అవార్డు అందుకోనున్నారు. 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్' చిత్రానికి రణదీప్ హుడా ఉత్తమ తొలి దర్శకుడి అవార్డు పొందనున్నారు. వీటితో పాటు పలు భాషల్లో ఘనవిజయం సాధించిన 'కల్కి 2898-ాఏఐ', 'అమరన్', 'పుష్ప: ది రూల్ పార్ట్-02', 'భూల్ భూలయ్యా 3', 'స్త్రీ 2' చిత్రాలు కూడా వివిధ విభాగాల్లో జాతీయ అవార్డులు అందుకోనున్నాయి.

# భక్తుడు మర్చిపోయిన వస్తువులు అప్పగింత

**నిజాయతీ చాటుకున్న టీటీడీ సిబ్బంది**

**అమరావతి,సెప్టెంబర్8:** తిరుమల కొండపై విధులు నిర్వర్తించే టీటీడీ సిబ్బంది మ-రోసారి తమ నిజాయతీని, అప్రమత్తతను చాటుకున్నారు. ఓ భక్తుడు పొరపాటున మర్చిపోయిన సుమారు రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగును విజిలెన్స్ సిబ్బంది సురక్షితంగా అతనికి అప్పగించారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం తిరుమల మార్గంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడుకు చెందిన పి. కార్తికేయన్ అనే భక్తుడు తన కుటుంబంతో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరారు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో అలిపిరి తనిఖీ కేంద్రం (చెక్‌పాయింట్) వద్ద తనిఖీల అనంతరం, ఆయన తన బ్యాగును అక్కడే మర్చిపోయి తిరుమలకు వెళ్లిపోయారు. విధి నిర్వహణలో ఉన్న విజిలెన్స్ సిబ్బంది అక్కడ పడి ఉన్న బ్యాగును గుర్తించారు. దాన్ని పరిశీలించగా, అందులో విలువైన బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదు ఉన్నట్లు గమనించారు. వెంటనే బ్యాగులో లభించిన వివరాల ఆధారంగా భక్తుడు కార్తికేయన్‌ను ఫోన్‌లో సంప్రదించారు. బ్యాగు తమ వద్ద సురక్షితంగా ఉందని, తిరిగి వచ్చి తీసుకువెళ్లాలని సమాచారం అందించారు.

## సంపాదకీయం



# అసెంబ్లీ గేటు వద్దే ప్రజాస్వామ్యానికి అడ్డుకట్టా?

**ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సరైన సంప్రదాయం కాదు**

**మహిళా ఎమ్మెల్యేల విషయంలో మరింత సంయమనం అవసరం**

**సభా నియమాలపై నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకరే**

**అధికారానికి సంయమనం.. ప్రతిపక్షానికి బాధ్యత అవసరం**

**గేట్ల వద్ద ఘర్షణలు కాదు.. సభలో ప్రజా సమస్యలపై చర్చ జరగాలి**

తెలంగాణ శాసనసభ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏమాత్రం శోభనివ్వవు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నల్ల దుస్తులతో సభకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడం, ఆ తర్వాత తోపులాటలు, అరెస్టులు చోటుచేసుకోవడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ముఖ్యంగా సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి వంటి మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారంటూ బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు మరింత వివాదానికి కారణమయ్యాయి. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో అసలు ఏం జరిగిందన్న దానిపై నిష్పక్షపాత విచారణ అవసరం ఏర్పడింది. ప్రజలు ఎన్నుకున్న శాసనసభ్యులు సభకు వెళ్లడం వారి హక్కు మాత్రమే కాదు.. తమను ఎన్నుకున్న ప్రజల తరపున గొంతు వినిపించాల్సిన బాధ్యత కూడా. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం, అవసరమైనప్పుడు నిరసన తెలియజేయడం ప్రతిపక్షానికి ప్రజాస్వామ్యం కల్పించిన అవకాశం. అయితే సభ్యులు సభలో ఎలాంటి దుస్తులు ధరించాలి? వాటిపై ఎలాంటి నినాదాలు ఉండవచ్చు? ఏది సభా మర్యాదలకు విరుద్ధం? ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించారా? అన్న అంశాలపై అంతిమంగా నిర్ణయం తీసుకోవాల్సింది సభాపతి. శాసనసభ గేటు వద్దే పోలీసులు ఆ పాత్రను తమ చేతుల్లోకి తీసుకునే పరిస్థితి ఏర్పడితే అది భవిష్యత్తులో ప్రమాదకరమైన సంప్రదాయానికి దారితీసే అవకాశం ఉంటుంది. ఈ వివాదంపై తెలంగాణ హైకోర్టు చేసినట్లు వెలువడిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోరాదని, సభా నియమాలను సభ్యులు ఉల్లంఘిస్తే ఆ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకర్ అని న్యాయస్థానం పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. మహిళా ప్రజాప్రతినిధులతో పోలీసులు వ్యవహరించినట్లు వచ్చిన ఆరోపణలనూ కోర్టు తీవ్రంగా పరిగణించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు మొత్తం ఘటనపై సమగ్రంగా సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఎవరి పరిధి ఎక్కడి వరకు? సభలోకి ప్రవేశించే ప్రజాప్రతినిధుల విషయంలో పోలీసులు ఎలా వ్యవహరించాలి? అన్న అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలి. మహిళా ఎమ్మెల్యేల విషయంలో వచ్చిన ఆరోపణలు మరింత సున్నితమైనవి. రాజకీయ పార్టీ ఏదైనా కావచ్చు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. మహిళా ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించే పరిస్థితులకు ఆస్కారం ఉండకూడదు. తోపులాట సమయంలో సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని, సబితా ఇంద్రారెడ్డితో దురుసుగా వ్యవహరించారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. మరోవైపు పోలీసులు ఈ ఆరోపణలను ఖండిస్తున్నారు. అందుకే అందుబాటులో ఉన్న పూర్తి వీడియో దృశ్యాలు, ఇతర ఆధారాలను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల బాధ్యతే. కానీ ఆ బాధ్యతను నిర్వర్తించే క్రమంలో సంయమనం, కనీస బలప్రయోగం, చట్టబద్ధమైన పద్ధతులు అత్యంత కీలకం. అందులోనూ ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులతో వ్యవహరించేటప్పుడు మరింత జాగ్రత్త అవసరం. అధికార వ్యవస్థ సంయమనం పాటించాలన్నంత మాత్రాన ప్రతిపక్షానికి బాధ్యత లేదని కాదు. నిరసన ప్రజాస్వామ్యంలో సహజమైన హక్కు. కానీ అది సభా గౌరవాన్ని దెబ్బతీసేలా ఉండకూడదు. వ్యక్తిగత దూషణలు, అభ్యంతరకర నినాదాలు, ఉద్రిక్తతను పెంచే చర్యలకు దూరంగా ఉండాలి. స్పీకర్ పదవి గౌరవాన్ని, శాసనసభ ప్రతిష్ఠను కాపాడాల్సిన బాధ్యత అధికార, ప్రతిపక్షాలకు సమానంగానే ఉంటుంది. ప్రజాస్వామ్యంలో ఎంత తీవ్రంగా విభేదించినా చివరకు చర్చకు వేదిక శాసనసభే కావాలి. నినాదాలకు సమాధానం లాఠీలు కాకూడదు. అలాగే రాజకీయ విమర్శలు వ్యక్తిగత దూషణల స్థాయికి దిగజారకూడదు. అసెంబ్లీ అంటే ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదిక. అక్కడ రైతుల సమస్యలు వినిపించాలి. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగం, పింఛన్లు, భూములు, సాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై చర్చ జరగాలి. ప్రతిపక్షం ప్రశ్నించాలి.. ప్రభుత్వం సమాధానం చెప్పాలి. కానీ సభ గేటు వద్ద తోపులాటలు, అరెస్టులు, పోలీసుల బలప్రయోగం, ప్రజాప్రతినిధులపై దురుసు ప్రవర్తన ఆరోపణలే ప్రధాన చర్చగా మారితే అసలు ప్రజా సమస్యలు వెనక్కి వెళ్లిపోతాయి. అంతిమంగా నష్టపోయేది ప్రజలే. అందుకే అసెంబ్లీ గేటు వద్ద జరిగిన మొత్తం ఘటనపై నిష్పక్షపాత విచారణ జరగాలి. వీడియో దృశ్యాలను పరిశీలించి పోలీసుల నుంచి అతిక్రమణ జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో శాసనసభ సమావేశాల సందర్భంగా ప్రజాప్రతినిధుల ప్రవేశం, నిరసనలు, పోలీసుల పాత్రపై స్పష్టమైన విధివిధానాలను రూపొందించాలి. మరోసారి ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా అధికార యంత్రాంగం, శాసనసభ వ్యవస్థ మధ్య సమన్వయం ఉండాలి. ప్రజాస్వామ్యంలో నిరసనను అణచివేయడం పరిష్కారం కాదు.. నిరసన పేరుతో సభా మర్యాదలను దాటడమూ సమర్థనీయం కాదు. అధికారానికి సంయమనం.. ప్రతిపక్షానికి బాధ్యత.. పోలీసులకు చట్టబద్ధమైన పరిధిపై స్పష్టత అవసరం. ఈ మూడూ సమతూకంగా ఉన్నప్పుడే శాసనసభ గేటు ఘర్షణలకు వేదిక కాకుండా.. సభ ప్రజల గొంతు వినిపించే నిజమైన ప్రజాస్వామ్య మందిరంగా నిలుస్తుంది.

# అంతిమ విజయం సత్యానిదే!

- యువత సత్యమార్గంలోనే నడుస్తోంది
- ప్రజా భాగస్వామ్యంతోనే శాశ్వత మార్పు
- ప్రజాసేవే అధికారానికి పరమార్థం
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం
- విమర్శకులకు వడోదర వేదికగా చురకలు
- భారీ అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం




**వడోదర, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** అసత్యాలను పదేపదే ప్రచారం చేసి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఎన్ని ప్రయత్నాలు జరిగినా అంతిమ విజయం సత్యానిదేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'అబద్ధాల హోరు' కంటే దేశ యువత స్వరం, వారి ఆకాంక్షలే బలమైనవని పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా వడోదరలో నిర్వహించిన బహిరంగ సభలో యువతను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉంటాయని, అయితే భారత యువత సత్యమార్గంలో ముందుకు సాగుతోందని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపడుతున్న విద్యార్థి కార్యక్రమాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ 'అబద్ధాల హోరు' కంటే యువత స్వరమే చివరకు గెలుస్తుందని వ్యాఖ్యానించారు. వడోదర–ముంబై మధ్య ఇటీవల ప్రారంభమైన డబుల్ డెకర్ గూడ్స్ రైలును ప్రస్తావించిన ప్రధాని.. ఒక్క ట్రిప్‌లో సుమారు 250 ట్రక్కులకు సమానమైన సరకు రవాణా చేయగల సామర్థ్యం దీనికి ఉందన్నారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాల్లోనూ కొందరు విమర్శించడానికి కారణాలు వెతుకుతున్నారని ప్రతిపక్షాలపై చురకలు అంటించారు. "డబుల్ డెకర్ గూడ్స్ రైలు ప్రారంభిస్తే ట్రక్ డ్రైవర్ల పరిస్థితి ఏమిటని అడుగుతారు. ట్రక్కుల పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నిస్తారు. విమర్శించేందుకు వారికి మరో అంశం దొరికినట్లే" అని వ్యాఖ్యానించారు. 2014కు ముందు ప్రత్యేక సరకు రవాణా కారిడార్ నిర్మాణంలో ఆశించిన పురోగతి జరగలేదని విమర్శించారు. గుజరాత్ పర్యటన సందర్భంగా వడోదరలో వేల కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నవసారిలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. అధికారం, వ్యవస్థలు, పదవులు ప్రజలకు సేవ చేసేందుకేనని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నామనే అహంకారం కాకుండా నిరంతరం ప్రజలకు సేవ చేయడమే తమ పార్టీ కార్యకర్తల లక్ష్యమని పేర్కొన్నారు. "విశ్రాంతి అనేది నిషిద్ధం" అన్నది కేవలం నినాదం కాదని, ప్రజాసేవలో నిరంతరం పనిచేసే విధానమని చెప్పారు. నవసారి జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలను మోదీ ప్రశంసించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో సాధారణ ప్రజలు భాగస్వాములైనప్పుడే వచ్చే మార్పు శాశ్వతంగా నిలుస్తుందని చెప్పారు. అలాంటి కార్యక్రమాలు సమాజంలో కొత్త విశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. నవసారిని పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న కృషిని అభినందించారు. ఒక జిల్లాను పోషకాహార లోపం నుంచి విముక్తం చేయడం ఎన్నికల్లో వచ్చే ఓట్ల కంటే ఎంతో విలువైన తల్లులు, కుటుంబాల ఆశీస్సులను అందిస్తుందని వ్యాఖ్యానించారు. క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న ప్రయత్నాలు భావితరాల ఆరోగ్యానికి పునాది వేస్తాయని పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న తొలినాళ్లను మోదీ గుర్తుచేసుకున్నారు. జూన్‌లో 44 డిగ్రీల తీవ్ర ఎండలోనూ బాలికల విద్య కోసం గ్రామాల్లో పర్యటించినట్లు తెలిపారు. చిన్నారులను పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులను ఒప్పించేందుకు చేసిన ప్రయత్నాలు తనకు రాజకీయ అధికారం కంటే ఎక్కువ సంతృప్తిని ఇచ్చాయని చెప్పారు. అభివృద్ధిపై విమర్శలు, రాజకీయ ఆరోపణలు ఎన్ని వచ్చినా యువత ఆకాంక్షలు, ప్రజల భాగస్వామ్యం, సత్యం ఆధారంగానే దేశం ముందుకు సాగుతుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# ప్రధాని భద్రతలో కలకలం

## మోదీ కార్యక్రమంలో నకిలీ గుర్తింపు కార్డుతో యువకుడు

## వెంట వచ్చిన వ్యక్తి వద్ద తుపాకీ

### ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ముంబై, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు భద్రతా వర్గాలను ఉలిక్కిపడే ఘటన చోటుచేసుకుంది. ప్రధాని పాల్గొనాల్సిన కార్యక్రమ వేదిక వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరి వద్ద ప్రధానమంత్రి కార్యాలయానికి చెందినదిగా చూపుతున్న నకిలీ గుర్తింపు కార్డు లభించగా.. అతడితో వచ్చిన మరో వ్యక్తి వద్ద తుపాకీ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ముంబైలోని బాంద్రా–కుర్లా కాంప్లెక్స్‌లో ఉన్న నీతా ముఖేశ్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో మంగళవారం ప్రధాని మోదీ పాల్గొనే కార్యక్రమం నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో వేదిక పరిసరాల్లో రోహన్ పరేఖ్ (24) అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని భద్రతా సిబ్బంది గుర్తించినట్లు సమాచారం. అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా తాను ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన అధికారినని చెప్పినట్లు తెలుస్తోంది. అతడు చూపించిన గుర్తింపు కార్డును పరిశీలించగా అది నకిలీదిగా తేలినట్లు సమాచారం.

### 'బాడీగార్డ్' వద్ద తుపాకీ

రోహన్‌తో పాటు ఉన్న మరో వ్యక్తి గురించి పోలీసులు ప్రశ్నించగా అతడు తన బాడీగార్డ్ అని చెప్పినట్లు సమాచారం. అయితే ఆ వ్యక్తి వద్ద తుపాకీ ఉండటాన్ని గుర్తించిన పోలీసులు వెంటనే ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు, గుర్తింపు పత్రాలు, ఇతర వస్తువులను పోలీసులు పరిశీలిస్తున్నారు. తుపాకీకి చట్టబద్ధమైన లైసెన్స్ ఉందా? నకిలీ గుర్తింపు కార్డు ఎక్కడ తయారైంది? ప్రధానమంత్రి కార్యాలయం పేరుతో గుర్తింపు కార్డును ఎందుకు ఉపయోగించారు? ప్రధాని పాల్గొనే కార్యక్రమ వేదిక వద్దకు వీరు ఏ ఉద్దేశంతో వచ్చారు? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రధాని పాల్గొనే కార్యక్రమానికి ముందు నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో ఇద్దరు వ్యక్తులు వేదిక పరిసరాల్లో కనిపించడం భద్రతా వర్గాల్లో కలకలం రేపింది. ఘటన వెనుక ఉద్దేశం ఏమిటన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

### నా క్లయింట్‌ను తప్పుదోవ పట్టించారు..

ఈ కేసులో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. రోహన్ పరేఖ్ తరపున హాజరైన లాయర్ తన క్లయింట్ మోసపోయి ఉండొచ్చని ముంబై కోర్టులో వాదించారు. కోర్టు విచారణ సందర్భంగా రోహన్‌కు అధికారికంగా కనిపించే ఆఫర్ లెటర్, గుర్తింపు కార్డు, ప్రధాని మోదీ సంతకంతో ఉన్నట్లు చెబుతున్న ఒక లేఖ అందాయని లాయర్ తెలిపారు. ఇదే కాకుండా ప్రధాని కార్యాలయంలో అదనపు కార్యదర్శి పేరుతో ఉన్నట్లు చెబుతున్న ఓ ఈమెయిల్ కూడా రోహన్‌కు వచ్చినట్లు కోర్టుకు వెల్లడించారు. ఈ పత్రాలు, సంప్రదింపుల కారణంగానే తన క్లయింట్ నిజంగా పీఎంఓకు సంబంధించిన ఉద్యోగం పొందినట్లు నమ్మాడని ఆయన తరుఫు న్యాయవాది వాదించారు. ఎవరో వ్యక్తి రోహన్‌ను మోసం చేసి ఉండొచ్చని పేర్కొన్నారు. అయితే, రోహన్ చెబుతున్నవి నిజాలా? లేదా? , అతడి వద్ద లభించిన ఐడీ కార్డు నిజమైందా.? ఎవరు తయారు చేశారు? దీని వెనక ఎవరున్నారనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ముంబై కోర్టు రోహన్ పరేఖ్‌ను సెప్టెంబర్ 11 వరకు పోలీస్ కస్టడీకి పంపింది.

# టీచర్ల నియామకాల్లో అర్హతలేనివారికి 'నో ఎంట్రీ'

## సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు ■ నిర్దేశిత అర్హతలు తప్పనిసరి

### విలీనం పేరుతో నిబంధనలు పక్కన పెట్టొద్దు ■ పారదర్శకత, మెరిట్‌కే ప్రాధాన్యం

## విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యమన్న ధర్మాసనం




**ఢిల్లీ, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్ ):** దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యావ్యవస్థలో నాణ్యతను కాపాడేందుకు అర్హత లేని వ్యక్తులను టీచర్లుగా నియమించకూడదని స్పష్టం చేసింది. ఆర్టీఈ, ఎన్సీటీఈ, యూజీసీ నిబంధనల ప్రకారం నిర్దేశించిన అర్హతలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారిని కొత్తగా నియమించడం మాత్రమే కాకుండా.. ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిని కూడా కొనసాగించడానికి వీల్లేదని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఉపాధ్యాయుల నియామకాల్లో విద్యార్థుల ప్రయోజనాలు, బోధనా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. ప్రభుత్వ సర్వీసుల్లోకి ఉపాధ్యాయులను విలీనం చేసే పేరుతో పారదర్శకమైన, పోటీతత్వ నియామక ప్రక్రియను పక్కన పెట్టడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎలాంటి పారదర్శక నియామక ప్రక్రియ లేకుండా.. అర్హతలు లేని వ్యక్తులను ప్రభుత్వ సర్వీసుల్లోకి తీసుకోవడాన్ని అంగీకరించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆర్టీఈ, ఎన్సీటీఈ, యూజీసీ నిబంధనలకు అనుగుణంగా అర్హతలు ఉన్నవారినే ఉపాధ్యాయులుగా నియమించాలని పేర్కొంది. అర్హత ప్రమాణాలను పాటించకుండా నియామకాలు చేపడితే విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. దీంతో టీచర్ల నియామకాల్లో ఇకపై నిబంధనలు, పారదర్శకత, మెరిట్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.




# ఐక్యరాజ్యసమితి కొత్త మ్యాప్

## అరుణాచల్, అక్సాయ్ చిన్‌లపై వేర్వేరు సరిహద్దు గీతలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** ఐక్యరాజ్యసమితి (యూఎన్) విడుదల చేసిన నూతన ప్రపంచ పటం భారత్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాల సరిహద్దుల విషయంలో భారత, చైనా దేశాల వాదనలకు అనుగుణంగా వేర్వేరు గీతలను (ఇండియన్ లైన్, చైనీస్ లైన్) చూపించడం వివాదానికి దారితీసింది. అయితే, ఈ ప్రాంతాలను చైనాలో భాగమని యూఎన్ అధికారికంగా ప్రకటించలేదని, కేవలం ఇరు దేశాల ప్రాదేశిక వాదనలను ప్రతిబింబించేలా ఈ గీతలను పొందుపరిచినట్లు తెలుస్తోంది. భూభాగాల పరిమాణాలను వాస్తవికంగా చూపించే లక్ష్యంతో యూఎన్ జనరల్ అసెంబ్లీ 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త మ్యాప్‌లో అరుణాచల్ ప్రదేశ్‌కు అస్సాం వైపు ఉన్న దక్షిణ సరిహద్దును 'చైనీస్ లైన్'గా, టిబెట్ వైపు ఉన్న ఉత్తర సరిహద్దును 'ఇండియన్ లైన్'గా చూపించారు. అలాగే లద్దాఖ్‌లోని అక్సాయ్ చిన్ ప్రాంతంలోనూ రెండు వేర్వేరు గీతలను పొందుపరిచారు. జమ్మూ కాశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉన్న లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్ఓసీ)ను చుక్కల గీతతో సూచిస్తూ, దీనిపై ఇంకా తుది ఒప్పందం కుదరలేదని వివరణ ఇచ్చారు. ఈ తీర్మానానికి భారత్ మద్దతు తెలిపినప్పటికీ, యూఎన్ మ్యాప్‌లలో ప్రదర్శించే సరిహద్దుల చిత్రీకరణను తాము ప్రత్యేకంగా ఆమోదించడం లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

# మండపాలకు తాత్కాలిక కనెక్షన్ తప్పనిసరి!

- 500 వాట్లకు రూ. 1000, 1000 వాట్లకు రూ. 2250
- అనధికారికంగా విద్యుత్ వాడితే క్రిమినల్ కేసులు
- ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి వెల్లడి



**విజయవాడ (సమయం న్యూస్):** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి సూచించారు. 'భక్తితో పూజిద్దాం.. భద్రతతో పండుగ జరుపుకుందాం' అని ఆయన పిలుపునిచ్చారు. మండపాల్లో విద్యుత్ అలంకరణలు, తాత్కాలిక విద్యుత్ వినియోగం విషయంలో నిర్వాహకులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. గణేష్ మండపాలను విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు తగినంత దూరంలో ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**నాణ్యమైన వైర్లు వాడాలి..**

విద్యుత్ అలంకరణలకు నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు, ప్లగ్‌లు మాత్రమే వినియోగించాలని సీఎండీ స్పష్టం చేశారు. మండపాలకు అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని, విద్యుత్ వైరింగ్ ఇతర పనులను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్లతోనే చేయించుకోవాలని సూచించారు. అధిక లోడ్ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన సామర్థ్యం కలిగిన వైరింగ్, రక్షణ పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాల సమయంలో విద్యుత్ పరికరాలు, వైర్లు తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పుల్లారెడ్డి సూచించారు. తడిసిన విద్యుత్ పరికరాలను చేతితో తాకరాదని హెచ్చరించారు. విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా వాటికి దూరంగా ఉండాలని.. వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని కోరారు. అత్యవసర వాహనాలు, సేవలకు ఆటంకం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

**కనెక్షన్ల ఫీజులు ఇలా..**

వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ వరకు గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా అందించనున్నట్లు సీఎండీ తెలిపారు. 500 వాట్లకు రూ. 1,000, 1,000 వాట్లకు రూ. 2,250 చొప్పున తాత్కాలిక విద్యుత్ సరఫరా రుసుము ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు రుసుము రూ. 100గా నిర్ణయించినట్లు తెలిపారు. తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ కోసం స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలు, ఏపీసీపీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్, మీ–సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మండపాల నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టవిరుద్ధంగా విద్యుత్‌ను వినియోగించరాదని సీఎండీ హెచ్చరించారు. అనధికారిక కనెక్షన్లు తీసుకోవడం, అక్రమంగా విద్యుత్ వాడటం గుర్తిస్తే నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో వైద్య విద్యకు కొత్త ఊపు!

- అంతర్జాతీయ ప్రమాణాలే లక్ష్యంగా విప్లవాత్మక మార్పులు
- ఏఐ, ఎల్ఎమ్ఎస్ వంటి ఆధునిక విధానాల అమలు
- 19 ప్రభుత్వ కాలేజీల్లో 50 ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లు
- డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ డా. పులాల చంద్రశేఖర్



**విజయవాడ (సమయం న్యూస్):** ఏపీలో వైద్య విద్యా ప్రమాణాలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడం, పరిశోధనలను ప్రోత్సహించడం, అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కీలక సంస్కరణలు చేపడుతున్నట్లు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.పి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం విజయవాడలోని వర్సిటీ ఆవరణలో ఆయన, రాష్ట్ర ప్రభుత్వ వైద్య విద్యా సలహాదారు (ఎన్నారై) డా.లోకేష్ ఈదర, ప్రముఖ అనస్థీషియాలజిస్ట్ డా.కె.వి.రావులతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఇటీవల ఎన్ఐఆర్ఎఫ్, న్యాక్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్ర కాలేజీలు ఉత్తమ ప్రతిభ కనబరిచాయన్నారు. విశాఖ ఆంధ్ర మెడికల్ కాలేజ్ జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించిందన్నారు.

**కొత్తగా 50 ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లు..**

విద్యార్థుల అధ్యయనం కోసం త్వరలోనే 'లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (ఎల్ఎమ్ఎస్), ఏఐ ఆధారిత విద్యా విధానాన్ని యూనివర్శిటీలో అమలు చేస్తామన్నారు. పారదర్శక పరీక్షా విధానంతో పాటు అకడమిక్స్, రీసెర్చ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. దేశంలో సగటు ఆయుర్దాయం 72 ఏళ్లకు పెరిగిన నేపథ్యంలో.. వయోవృద్ధుల సంరక్షణ కోసం 'జిరియాట్రిక్ మెడిసిన్', 'ఫ్యామిలీ మెడిసిన్' విభాగాల విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వీసీ తెలిపారు. రోగుల ప్రాణాలను కాపాడటంలో కీలకమైన అత్యవసర విభాగాన్ని బలోపేతం చేసేందుకు ఈ విద్యా సంవత్సరం నుంచి 19 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 50 'బీఎస్సీ ఎమర్జెన్సీ మెడిసిన్' సీట్లను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్య విద్యా సలహాదారు డా.లోకేష్ ఈదర మాట్లాడుతూ.. ఎంసీక్యూ ఆధారిత అసెస్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. డా.కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్య, పరిశోధనల సమన్వయంతోనే కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని అన్నారు.

**ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో మార్పులు..**

2026ఉ27 విద్యా సంవత్సరానికి జరుగుతున్న ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.టి.సాయి సుధీర్ వివరాలు వెల్లడించారు. ఫేజ్–1లో 4,321 సీట్లు కేటాయించగా 4,231 మంది రిపోర్ట్ చేశారని, మరో 90 మంది రిపోర్ట్ కాలేదన్నారు. ప్రస్తుతం ఫేజ్ఉ2 ఆలిండియా కోటా కౌన్సెలింగ్ సెప్టెంబర్ 3 నుంచి 11 వరకు కొనసాగుతోందని, అది పూర్తయ్యాక స్టేట్ కోటా ఫేజ్–2 ప్రారంభించేందుకు ప్రతిపాదించామన్నారు. ఎంబీబీఎస్ తరగతులు సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. సవరించిన కౌన్సెలింగ్ విధానం ప్రకారం ప్రతి దశలోనూ అభ్యర్థులు కొత్తగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు తమకు నచ్చిన కాలేజీలను ప్రాధాన్యత క్రమంలో వీలైనంత ఎక్కువ సంఖ్యలో ఆప్షన్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల ఓపెన్ కేటగిరీలో సీటు పొందే అవకాశాలు పెరుగుతాయని, ఒకవేళ పరిమిత సంఖ్యలో కాలేజీలను ఎంచుకుంటే ఆ అవకాశాలు తగ్గుతాయని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

# డీఎస్సీలో అక్రమాలు జరిగాయి

**లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి: వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్**

**అమరావతి,సెప్టెంబర్8:** ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని, దీనికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్ చేశారు. విజిలెన్స్ విచారణ జరుగుతోందని అధికారులు చెప్పారని... దీని అర్థం డీఎస్సీలో అక్రమాలు జరిగాయని చెప్పడమే అని అన్నారు. విజిలెన్స్ పేరుతో కాలయాపన చేయకుండా ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటకు తీసేందుకు సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ కోటా కింద కేటాయించిన 382 ఉద్యోగాలను ఎవరికి ఇచ్చారో పూర్తి వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని మార్గాని భరత్ నిలదీశారు. జూడో అసోసియేషన్ ఛైర్మన్‌గా ఉన్న లోకేశ్ తోడల్లుడు శ్రీభరత్ పైనా ఆరోపణలు చేస్తూ... పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ అక్రమాలు జరిగాయని విమర్శించారు. అసెంబ్లీని, ప్రజలను పచ్చి అబద్ధాలతో తప్పుదోవ పట్టించిన లోకేశ్ కి జగన్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. "లోకేశ్ ఎమ్మెల్యే కాకముందే నేను ఎంపీగా గెలిచాను. డీఎస్సీ అక్రమాలపై లోకేశ్ తో ఎక్కడైనా చర్చకు నేను సిద్ధం. కరకట్ట నివాసమైనా, హైదరాబాద్ ఇల్లయినా తేదీ, సమయం ఆయనే ప్రకటించాలి" అని బహిరంగ సవాల్ విసిరారు.

# డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం

**పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్**

**అమరావతి,సెప్టెంబర్8:** టీడీపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమేనని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ఈ తరహా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని ఆయన ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేయడంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో తమ ఓటు బ్యాంకుకు నష్టం జరుగుతుందనే భయం వైసీపీని వెంటాడుతోందని బోడే ప్రసాద్ అన్నారు. అందుకే ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ భుజానికెత్తుకున్నారని విమర్శించారు.

# నేటి నుంచి ముంబైలో జాతీయ సదస్సు!

**'ఐఎఫ్ఏటీ ఇండియా-2026'కు ఏపీ పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి సురేష్ కుమార్**

**అమరావతి (సమయం న్యూస్):** పట్టణ పరివర్తన, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. ముంబైలో సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు జరగనున్న 'ఐఎఫ్ఏటీ ఇండియాఉ2026' జాతీయ సదస్సులో ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ విశిష్ట అతిథిగా, వక్తగా పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను ఆయన ఈ వేదికగా వివరించనున్నారు. పట్టణ పాలనా సంస్కరణలు, సుస్థిర సేవల అందజేత వంటి అంశాలతో పట్టణ పరివర్తనలో ఏపీ ఇప్పటికే అగ్రగామిగా నిలిచింది. ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరగనున్న ఈ సదస్సులో భారతదేశంలో వ్యర్థాల నిర్వహణ, పట్టణ సుస్థిరత వ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చిస్తారు. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద చేపట్టిన కార్యక్రమాలతో వ్యర్థాల నిర్వహణలో ఏపీ మార్గదర్శక రాష్ట్రంగా నిలిచింది. అలాగే, గత జనవరి నుంచి ప్రతి నెలా నిర్వహిస్తున్న 'స్వర్ణాంధ్రఉస్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ద్వారా వ్యర్థాల నిర్వహణ పట్ల ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. సుస్థిర మౌలిక సదుపాయాలు, వ్యర్థాల నిర్వహణలో రాష్ట్రం సాధించిన విజయాలను ఈ సదస్సులో ప్రముఖంగా ప్రదర్శించనున్నారు. ఐఎఫ్ఏటీ ఇండియా అనేది ఘన వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ సాంకేతికతలపై నిర్వహించే ప్రముఖ వాణిజ్య ప్రదర్శన. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడిదారులు తదితరులు ఈ సదస్సుకు హాజరవుతారు. సెప్టెంబర్ 9న 'సుస్థిర పారిశుధ్యం కోసం పురపాలక సేవల అందజేతను మెరుగుపరచడం' అనే అంశంపై జరిగే చర్చలో ఎస్.సురేష్ కుమార్ ప్యానలిస్టుగా పాల్గొననున్నారు. ఈ సదస్సులో కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ '2027 అనంతరం పట్టణ పారిశుధ్యం' అనే అంశంపై ప్రత్యేక సదస్సును కూడా నిర్వహించనుంది.

# ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లపై యూకే కఠిన చర్యలు

**ఇజ్రాయెల్‌కు భారీ దౌత్యపరమైన ఎదురుదెబ్బ**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్8:** అంతర్జాతీయ వేదికపై ఇజ్రాయెల్‌కు భారీ దౌత్యపరమైన ఎదురుదెబ్బ తగిలింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లతో వాణిజ్య సంబంధాలపై బ్రిటన్ (యూకే) ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ సెటిల్‌మెంట్ల నుంచి వచ్చే అన్ని రకాల వస్తువుల దిగుమతితో పాటు ఫైనాన్సింగ్, నిర్మాణ రంగం వంటి సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. బ్రిటన్ తీసుకున్న ఈ కీలక నిర్ణయానికి ఫ్రాన్స్, కెనడా సైతం మద్దతు ప్రకటించడమే కాకుండా, తాము కూడా ఈ నిషేధంలో భాగస్వామ్యం పంచుకోనున్నట్లు వెల్లడించాయి. వెస్ట్ బ్యాంక్‌లోని పలు ప్రాంతాల్లో 'సెటిలర్ టెర్రరిస్టులు' పాలస్తీనియన్లపై జాతి నిర్మూలనకు పాల్పడుతున్నారని బ్రిటన్ విదేశాంగ మంత్రి ఎడ్ మిలిబాండ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలస్తీనా ప్రజల ఇళ్లను కూల్చివేయడం, రహదారులు, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం వంటి చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ సమాజం కళ్లముందే పాలస్తీనాలో జరుగుతున్న ఈ పరిణామాల పట్ల తాను సిగ్గుపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రధాని ఆండీ బర్న్‌హామ్ నేతృత్వంలోని లేబర్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్ విషయంలో యూకే తన విదేశాంగ విధానంలో తీసుకొచ్చిన అతిపెద్ద మార్పుగా దీనిని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఏడాది బ్రిటన్ ప్రభుత్వం పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా గుర్తించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. బ్రిటన్ నిర్ణయంపై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు తీవ్రంగా స్పందించాయి. ఇది 'తీవ్రమైన తప్పుడు అంచనా' అని, తమ ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ మండిపడ్డారు. "బ్రిటన్ మాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే, మేము కూడా బ్రిటన్‌కు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ హెచ్చరించారు. ఇజ్రాయెల్‌లోని అమెరికా రాయబారి మైక్ హకబీ ఈ చర్యను 'యూదు ప్రజలపై చూపిస్తున్న వివక్ష'గా అభివర్ణించారు. దీనికి ప్రతిగా అమెరికా నుంచి ప్రతీకార చర్యలు ఉండవచ్చని ఆయన సంకేతాలిచ్చారు. ఈ ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో, బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సోమవారం ఫోన్లో మాట్లాడినట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది.

# తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో దోషికి ఉరిశిక్ష

**తీర్పు వెలువరించిన పోక్సో కోర్టు సంచలన**

**తిరునల్వేలి,సెప్టెంబర్8:** మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు ఓ ప్రార్థనా స్థలంలో విలాతికుళానికి చెందిన పెయింటర్ మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు మార్చుకున్నాక వారిద్దరూ సుమారు రెండు వారాల పాటు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన మునీశ్వరన్, సదరు బాలికను తన ద్విచక్ర వాహనంపై మీనాక్షిపురంలోని తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం మునీశ్వరన్ తన స్నేహితులైన చిన్నకుట్టి (28), మురుగేశన్ (23)లను అక్కడికి పిలిపించాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, వారు కూడా బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ దారుణం గురించి బాధితురాలు తన తల్లిదండ్రులకు తెలపడంతో, వారు పాళయంకోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు చిన్నకుట్టికి మరణశిక్ష విధించగా, మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

# రెండో రోజూ నష్టాల బాటలో మార్కెట్లు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్8:** అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ జూన్ మధ్య నుంచి చూస్తే కనిష్ఠ స్థాయికి చేరాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలు మార్కెట్లపై మరింత ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 555.23 పాయింట్లు పతనమై 75,577.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 144.05 పాయింట్లు కోల్పోయి 23,635.10 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 0.73 శాతం, నిఫ్టీ 0.61 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు ఎక్కువగా పడిపోయాయి. మరోవైపు ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు కొంత మద్దతు ఇచ్చాయి. అయితే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మాత్రం స్వల్ప లాభాలతో ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.21 శాతం, స్మాల్‌క్యాప్ 0.17 శాతం చొప్పున పెరిగాయి. చమురు ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే మార్కెట్‌లో ఒడుదొడుకులు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గత ఐదు, ఆరు నెలల్లో మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లు భారీగా రాణించడంతో ఇకపై వాటి జోరు కొనసాగడం కష్టమేనని అభిప్రాయపడుతున్నారు. పెద్ద కంపెనీల షేర్లు, ఈక్విటీ ఆధారితేతర ఈటీఎఫ్‌ల వైపు దృష్టి పెట్టడం సురక్షితమని సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే రూపాయి విలువ కూడా బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 0.29 శాతం క్షీణించి 94.81 వద్ద ట్రేడైంది. డాలర్ 98.95 సమీపంలో ఉండగా.. బ్రెంట్ క్రూడ్ ధర 97 డాలర్ల వద్ద కొనసాగింది.



# కూచిపూడికి శాశ్వత ప్రాణదాత వేదాంతం శర్మ

## నేడు వేదాంతం సత్యనారాయణ శర్మ జయంతి

కూచిపూడి నాట్యకళకు ప్రపంచ వేదికలపై విశిష్టమైన గుర్తింపును తెచ్చిన కళా మహనీయుడు వేదాంతం సత్యనారాయణ శర్మ. స్త్రీ పాత్రలను పోషించడంలో ఆయన కనబరచిన నైపుణ్యం, అభినయ శక్తి, హావభావాల లోని సున్నితత్వం కూచిపూడి నాట్య చరిత్రలో చిరస్మరణీయ ఘట్టం. స్త్రీ వేషధారణలో ఆయన చూపిన అద్భుత కౌశల్యం వల్లే కళా రసికులు ఆయనను "స్త్రీ పాత్రల నటనా సార్వభౌముడు"గా సత్కరించారు. 1935 సెప్టెంబర్ 9న కృష్ణా జిల్లాలోని కూచిపూడి గ్రామంలో జన్మించిన ఆయనకు కళారంగం వారసత్వంగా లభించింది. తండ్రి వేదాంతం వెంకట రామయ్య స్వయంగా కూచిపూడి కళాకారుడు. బాల్యం నుంచే నాట్యాసక్తి కలిగిన ఆయన, వేదాంతం రాఘవయ్య, వేదాంతం వెంకట చలపతి, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి వంటి గురువుల వద్ద శిక్షణ పొందారు. ఈ శిక్షణ లోనే ఆయనకు స్త్రీ పాత్రల నటనలోని మెళకువలు అవగాహన అయ్యాయి.

శర్మగారు సత్యభామ పాత్రలో చేసిన "భామాకలాపం" ప్రదర్శన అమర కీర్తిని తెచ్చింది. సత్యభామ అహంకారం, అలక, భక్తి, ప్రణయభావాలు ఆయన అభినయంతో జీవం పొందాయి. "ఉషా పరిణయం"లో చిత్రలేఖగా, "క్షీరసాగర మథనం"లో మోహినిగా ఆయన కనబరచిన నటనా వైభవం ప్రేక్షకులను విభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఆయన మోహిని పాత్ర ధారణలోని ఆకర్షణీయమైన లావణ్యం, సౌందర్య భావన, మృదువైన హావభావాలు ప్రేక్షకుల హృదయాలలో అచంచల ముద్ర వేశాయి. కేవలం నటనలోనే కాదు, దర్శకత్వంలోనూ ఆయన తన ప్రతిభను చాటారు. పునరావృతమవుతున్న నాట్య, నాటికలకు కొత్తదనాన్ని జోడించి, సంప్రదాయంలో ఆధునికతను కలిపారు. ఆయన చేసిన ప్రదర్శనలు దేశమంతటా మాత్రమే కాక, అమెరికా, యూరప్, రష్యా, జపాన్ వంటి అనేక దేశాలలోనూ కూచిపూడికి విశేష గౌరవాన్ని తెచ్చాయి. గురువుగా ఆయన పాత్ర మరింత విశిష్టం. ఆంధ్ర విశ్వవిద్యాలయం, పి.ఎస్. తెలుగు విశ్వవిద్యాలయం వంటి విద్యాసంస్థల్లో ఆయన బోధన చేసి, అనేకమంది శిష్యులను తీర్చిదిద్దారు. ఆయన శిష్యులు కూచిపూడి నాట్యానికి ప్రతిష్ఠ తీసుకొచ్చారు. గురుకుల పద్ధతిని పునరుద్ధరించి, శిష్యులకు శాస్త్ర బద్ధంగా, సంప్రదాయ పూర్వకంగా శిక్షణ అందించారు. కేవలం నృత్యకళ నేర్పడమే కాదు, కూచిపూడి తత్త్వం, దాని ఆధ్యాత్మిక పరమార్థాన్ని కూడా ఆయన శిష్యులలో నాటారు. శర్మ కళాకారుడిగానే కాక, పరిశోధకుడిగానూ కూచిపూడికి అపూర్వమైన సేవ అందించారు. "భామాకలాపం – ఒక సమగ్ర అధ్యయనం", "కూచిపూడి నృత్య చరిత్ర", "నాట్యశాస్త్రం – కూచిపూడి దృక్కోణం", "కూచిపూడి యక్ష గానాలు" వంటి గ్రంథాలను రచించి, నాట్య శాస్త్రానికి, కూచిపూడి సంప్రదాయానికి శాస్త్రీయ స్థిరత్వాన్ని కల్పించారు. ఆయన రచనల ద్వారా కూచిపూడి కళారూపం విశ్వ విద్యాలయ స్థాయిలో అధ్యయనార్థకమైన శాస్త్రీయమైన ఆధారాన్ని పొందింది. ఈ కారణంగానే కూచిపూడి కళ పాఠశాలలకే పరిమితం కాక, విశ్వ వ్యాప్తంగా పరిశోధనలకు, పాఠ్యాంశాలకు స్థానం సంపాదించింది. ఆయన కృషికి గుర్తింపుగా అనేక గౌరవాలు వరించాయి. 1961లో సంగీత నాటక అకాడమీ అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే కళాప్రపూర్ణ బిరుదు, 1998లో పద్మభూషణ్, 2011లో పద్మశ్రీ వంటి విశిష్ట పురస్కారాలు ఆయన కళా మహిమాన్వితతకు నిదర్శనం. అదేవిధంగా, మధ్యప్రదేశ్ ప్రభుత్వం 1988లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కాళిదాస్ సమ్మాన్ అవార్డుతో సత్కరించింది. 2005లో తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం "హంస అవార్డు"ను అందచేసింది. సిద్ధేంద్రయోగి నర్తన అవార్డును అందుకున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం "భరతముని అవార్డు"తో సత్కరించింది. ఈ గౌరవాలు ఆయన ప్రతిభకు కేవలం బిరుదులు మాత్రమే కాక, కళామహిమాన్వితతకు ఇచ్చిన సాక్ష్యాలు. కూచిపూడి నాట్య ప్రదర్శనల ద్వారా వేదాంతం సత్యనారాయణ శర్మ మన తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ నుండి ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్రపతులు వి.వి.గిరి, నీలం సంజీవరెడ్డి, డా. శంకర్ దయాళ్ శర్మ, డా. జకీర్ హుస్సేన్, డా. ఆర్.కె. నారాయణన్‌ల వంటి మహానుభావుల చేత ప్రశంసలు పొందారు. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ప్రధాన మంత్రులుగా ఇంద్రాగాంధీ, పి.వి. నరసింహారావు వంటి నేతలు ఆయన ప్రదర్శనలను ప్రత్యక్షంగా తిలకించి ప్రశంసించారు. ఈ గుర్తింపులు కేవలం కళాకారుడికి మాత్రమే కాక, కూచిపూడి సంప్రదాయానికే మరింత గౌరవం తీసుకొచ్చాయి.

2012 నవంబరు 15న ఆయన పరమపదించినా, ఆయన వారసత్వం నేటికీ కూచిపూడి ప్రతి ప్రదర్శనలో జీవిస్తూనే ఉంది. ఆయన బోధనలు, రచనలు, ప్రదర్శనలు, శిష్యులు కలసి కూచిపూడిని శాశ్వత సజీవ కళారూపంగా నిలబెట్టాయి. వేదాంతం సత్యనారాయణ శర్మ కేవలం కళాకారుడు మాత్రమే కాదు, కూచిపూడికి నూతన శక్తి ప్రసాదించిన మహనీయ సంస్కృతి శిల్పి. అందుకే ఆయనను సంస్కృతిక లోకం "కూచిపూడికి జీవం పోసిన పురుషోత్తముడు"గా కీర్తించింది. వేదాంతం సత్యనారాయణ శర్మ జీవన కృషి ఒక కళాకారుని వ్యక్తిగత ప్రతిభకు మించినది; అది సంపూర్ణంగా కూచిపూడి నాట్య సంప్రదాయాన్నే ప్రపంచానికి పరిచయం చేసిన ఒక మహోన్నత సంస్కృతి యజ్ఞం. ఆయన వారసత్వం శాశ్వతం, ఆయన కీర్తి అమరత్వం.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# బడి పలుకుల భాష కాదు.. బతుకు పలుకుబడుల భాష!

## తెలంగాణ భాష: సహజత్వానికి సజీవ సాక్ష్యం

### నేడు తెలంగాణ భాషా దినోత్సవం

**భాష అనేది కేవలం మానవ భావ వ్యక్తీకరణకు ఉపకరించే శబ్ద సముదాయం మాత్రమే కాదు; అది ఒక సమగ్ర జాతి సాంస్కృతిక జీవన విధానానికి సజీవ సాక్ష్యం, శతాబ్దాల చారిత్రక పరిణామాల దర్పణం. మనిషి పుట్టిన నేల స్వభావం, పీల్చిన గాలిలోని అనురాగం, సాగుచేసిన మట్టిలోని పరిమళం, శ్రమజీవుల స్వేదబిందువుల తడి, పోరాటాల సెగలు అన్నీ ఏకమై భాషకు ఒక నిర్దిష్టమైన జీవద్భావరూపాన్ని, తిరుగులేని ఆత్మగౌరవాన్ని ప్రసాదిస్తాయి. అందుకే తెలంగాణ భాష అనగానే కేవలం కొన్ని విలక్షణమైన యాస పదాలు, వ్యావహారిక శబ్దాల సమాహారంగా భావించడం చారిత్రక దృష్టిలో అసంపూర్ణమైన అవగాహన మాత్రమే అవుతుంది.**



తెలంగాణ పలుకుబడి శతాబ్దాల సామాజిక మథనం, శ్రమ సౌందర్యం, అన్యాయంపై ఎక్కుపెట్టిన ధిక్కార స్వరం, హాస్య చమత్కారాలు, అంతకుమించిన అమాయక ఆత్మీయతల పవిత్ర సంగమం. అలాంటి సజీవ ప్రజాభాషను గౌరవిస్తూ, తెలంగాణ ప్రజల గొంతుకకు అక్షరాలా రూపమిచ్చిన అక్షరయోధుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 9వ తేదీన 'తెలంగాణ భాషా దినోత్సవం'గా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించుకోవడం చారిత్రక ఔచిత్యం. 2014లో స్వయంపాలన సిద్ధించిన అనంతరం తెలంగాణ ప్రభుత్వం కాళోజీ జయంతిని అధికారికంగా తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించగా, 2018లో దీనిని రాష్ట్రస్థాయి అధికారిక వేడుకగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా తెలంగాణ మట్టి భాషకు రాజముద్రతో కూడిన సముచిత గౌరవం దక్కింది.

1914 సెప్టెంబర్ 9న కర్ణాటకలోని రట్టహళ్లిలో రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాజు కాళోజీ జన్మించినప్పటికీ, ఆయన బాల్యం, విద్యాభ్యాసం, చేతన, చింతన అంతా తెలంగాణ గడ్డపైనే ప్రాణం పోసుకున్నాయి. మడికొండ, వరంగల్, హైదరాబాద్ నగరాలలో సాగిన విద్యార్థి జీవితంలోనే ఆయన ప్రజాచైతన్యాన్ని పుణికి పుచ్చుకున్నారు. న్యాయవిద్యను అభ్యసించి నల్లకోటు ధరించినప్పటికీ, న్యాయస్థానపు నాలుగు గోడల మధ్య సంపన్నుల వివాదాలను పరిష్కరించడం కన్నా, నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న పీడిత ప్రజల పక్షాన నిలబడి అన్యాయాలను నిలదీయడానికే కాళోజీ జీవితాంతం అంకితమయ్యారు. ఆంధ్ర మహాసభ ఉద్యమం, గ్రంథాలయోద్యమం, రజాకార్ల దురాగతాలకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం, భారత స్వాతంత్ర్యోద్యమం, ఆ తరువాతి ప్రత్యేక తెలంగాణ ప్రజా ఆకాంక్షల ఉద్యమాలలో కాళోజీ కలం నిరంతరం ప్రజల పక్షాన గర్జించింది. 'నా గొడవ' పేరుతో ఆయన రాసిన విస్తృత కవితా సంపుటాలు కేవలం కవిత్వ గ్రంథాలు కావు; అవి ఆనాటి సమకాలీన సామాజిక, రాజకీయ, ఆర్థిక రుగ్మతలపై ఎక్కుపెట్టిన అక్షర తూటాలు. సంస్కృత భూయిష్టమైన కృత్రిమ పాండిత్య భాషను, ఛందోబద్ధ సంకెళ్లను తెంచుకుని, పల్లెటూరి మట్టిమనిషి నిత్యం మాట్లాడే పచ్చి పల్లె పలుకుబడినే సాహిత్య వేదికపై సగర్వంగా నిలబెట్టిన ఘనత కాళోజీకే దక్కుతుంది. 'భాష రెండు విధాలు– ఒకటి బడి పలుకుల భాష, మరొకటి పలుకుబడుల భాష; బడి పలుకుల భాష కన్నా పలుకుబడుల భాషే గొప్పది' అని కుండబద్దలు కొట్టిన కాళోజీ, సామాన్యుడి కన్నీటిని, చెమటను, నిరసనను, కోపాన్ని తన కవిత్వంలో కేంద్రబిందువుగా ప్రతిష్ఠించారు. 'పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది' అని నినదించి, యావజ్జీవితాన్ని ప్రజా సమస్యలకే ధారపోసి, మరణానంతరం కూడా తన పార్థివ దేహాన్ని వైద్య పరిశోధనల కోసం కాకతీయ వైద్య కళాశాలకు దానమిచ్చి మాటను చేతల్లో చూపిన అపురూప మానవతావాది కాళోజీ.

తెలంగాణ భాషా ప్రాచీనతను, గొప్పతనాన్ని అవగతం చేసుకోవాలంటే వేల ఏండ్ల సాహితీ చరిత్రను పునఃసమీక్షించుకోవాలి. క్రీస్తుపూర్వం శాతవాహనుల కాలం నాటి 'గాథాసప్తశతి' ప్రాకృత గ్రంథంలోనే అత్త, వదిన, పిల్ల, వోడ వంటి దేశి పదాలు విరివిగా కనిపించడం తెలంగాణ నేల భాషా ప్రాచీనతకు తిరుగులేని చారిత్రక నిదర్శనం. ప్రథమ తెలుగు పద్య శాసనంగా ప్రసిద్ధి చెందిన క్రీస్తుశకం 946 నాటి ధర్మపురి క్షేత్రం అగ్రహార దానం గురించి తెలిపే

కురిక్యాల శాసనాన్ని నిర్మించిన పంప మహాకవి సోదరుడు జినవల్లభుడు తెలంగాణ నేలపైనే కంద పద్యాలకు ప్రాణం పోశాడు. పాల్కురికి సోమనాథుడు 12వ శతాబ్దంలోనే గంభీర సంస్కృత పదాల సంకెళ్లను తెంచి 'జానుతెనుగు'లో దేశి ద్విపద కావ్యాలు రచించి 'ఒగి నెల్ల యెడల దేశీయ పదముల జానుదెనుగున' అంటూ సామాన్యుల భాషకు కావ్యగౌరవాన్ని కల్పించాడు. మల్లికార్జున పండితారాధ్యుడు, కాకతీయుల కాలం నాటి శివకవులు, బమ్మెర పోతన, గోల్కొండ కవుల వరకు ఈ నేల సహజ దేశీయ పదసంపదతో పరవళ్లు తొక్కింది. ఆ తదనంతర చారిత్రక పరిణామాలలో బహమనీలు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల సుదీర్ఘ పాలన ప్రభావంతో తెలుగు భాష పరిధి విస్తృతమై ఉర్దూ, దఖనీ, మరాఠీ, కన్నడ, పారశీక భాషల పదాలు సహజంగా తెలుగులో కలగలిసి పోయాయి. తెలంగాణ ప్రజలు ఆ పదాలను యథాతథంగా స్వీకరించక, తమ నాలుకలకు అనువైన రీతిలో, తమ వ్యాకరణానికి ఒదిగేలా 'స్వదేశీకరించుకుని' సొంతం చేసుకున్నారు. ఆ విధంగా రూపుదిద్దుకున్న భాషా సంపద ఎన్నటికీ కలుషితం కాదు; విభిన్న సంస్కృతుల కలయికతో ఏర్పడిన అద్భుతమైన చారిత్రక సమన్వయ సంపద.

'అయ్యా', 'బాబూ', 'ఎట్లున్నావ్', 'ఏమాయె', 'బిడ్డా', 'నయంగున్నదా', 'పోతన్నావా', 'వస్తన్నావా' వంటి వాత్సల్యభరిత పలుకుబడులు, 'అవ్వ', 'తాత', 'బావ', 'అన్న', 'అక్క' వంటి సంబోధనల్లోని అనురాగం తెలంగాణ సంభాషణలకు ప్రత్యేకమైన మాధుర్యాన్నిస్తాయి. మాటలో మమకారం, పలుకులో పరిమళం, పిలుపులో ప్రాణం నింపడం తెలంగాణ భాష సహజ లక్షణం. శ్రామిక జీవులు పాడుకునే జాజర పాటలు, వరికోత పాటలు, బతుకమ్మ ఉత్సవాలలో స్త్రీల గొంతుల్లో పలికే ఆత్మీయ నివేదనలు, ఒగ్గుకథలు, బాలల కథలు, బుర్రకథలు, చిందు భాగవతాలు, కొమురవెల్లి మల్లన్న పట్నాలు, గిరిజనుల గోండు, కోయ మౌఖిక గాథలు ఈ భాషా సౌందర్యానికి ప్రత్యక్ష సాక్ష్యాలు. ప్రతి పల్లె పదంలోనూ ఒక శాస్త్రీయత, జీవన అనుభవం, ప్రకృతితో మమేకమైన విజ్ఞానం దాగి ఉన్నాయి. దురదృష్టవశాత్తూ ఉమ్మడి పాలన కాలంలో ఈ సజీవ భాషను సరైన అవగాహన లేకుండా 'యాస' అని, వ్యాకరణ విరుద్ధమని, సంస్కారహీనమని హేళన చేసిన చారిత్రక దుస్థితి నెలకొంది. ఏ భాషాశాస్త్రమైనా నిరూపించే ప్రాథమిక సత్యం ఏమిటంటే–భూగోళంపై ఏ భాషకైనా నికరమైన ప్రామాణికత అనేది కేవలం ఒక ప్రాంతానికో, వర్గానికో పరిమితం కాదు; ప్రతి ప్రాంతీయ మాండలికానికి దానిదైన శబ్ద పరిణామ సూత్రాలు, ధ్వని సౌందర్యం, వాక్య నిర్మాణం, నుడికారపు గాఢత ఉంటాయి. ప్రామాణిక గ్రంథస్థ భాష పరిపాలనకు, నిఘంటువులకు ప్రతీకైతే, మట్టిభాష ప్రజల నిత్య చైతన్యానికి శ్వాస వంటిది. రెండూ ఒకే తెలుగు భాషా వృక్షానికి ఉన్న రెండు బలమైన కొమ్మలు తప్ప పరస్పర విరుద్ధాలు కావు. ఒకదాని వైభవాన్ని చాటడానికి మరొకదానిని కించపరచాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు.


జాతీయ స్థాయిలో భాషా గణాంకాలను నిశితంగా పరిశీలిస్తే భారత జనగణన వివరాల ప్రకారం తెలుగు దేశంలోనే అత్యధికులు మాట్లాడే ప్రాచీన, అగ్రగామి ద్రావిడ భాషలలో ఒకటిగా భాసిల్లుతోంది. దేశవ్యాప్తంగా 8 కోట్లకు పైగా ప్రజలకు తెలుగు మాతృభాషగా ఉండగా, తెలుగు మాట్లాడే సమాజాలు కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే పరిమితం కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి పొరుగు రాష్ట్రాల్లోను, ఖండాంతర దేశాల్లోను విస్తరించి ఉన్నాయి.

జనగణన నివేదికలు స్పష్టం చేస్తున్నట్లుగా బహుభాషా సంస్కృతి ప్రజలను వేరుచేసే గోడ కాదు, విభిన్న జనసమూహాలను అనుసంధానించే సాంస్కృతిక వారధి. తెలంగాణ సమాజం శతాబ్దాలుగా బహుభాషలను తనలో ఇముడ్చుకుంటూనే తన ప్రత్యేక అస్తిత్వాన్ని, సహజత్వాన్ని కాపాడుకుంటూ వస్తోంది. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే సెప్టెంబర్ 9న భాషా దినోత్సవం జరుపుకోవడం అంటే కేవలం కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించడమో, సాంస్కృతిక సభల్లో ప్రసంగాలు దంచడమో లేదా కవి సమ్మేళనాలు నిర్వహించడమో మాత్రమే కాకూడదు. ఒక భాష దీర్ఘకాలం వర్ధిల్లాలంటే అది పరిపాలనా దస్త్రాలలో మాత్రమే కాక, ప్రజల నిత్య వ్యవహారంలో జీవించాలి; పసిపిల్లల ఆటపాటల్లో ప్రతిధ్వనించాలి; ఇంటి ముంగిళ్లలో ఆత్మీయంగా వినిపించాలి; పాఠశాల తరగతి గదుల్లో సంకోచం లేకుండా గౌరవించ బడాలి; సాహిత్య సృజనలో విస్తరించాలి; సినిమా, నాటక, డిజిటల్ మాధ్యమాలలో సహజ నైజంతో ఆవిష్కృతమవ్వాలి.

ఈ క్రమంలో మన విద్యా వ్యవస్థకు, ఉపాధ్యాయ లోకానికి అత్యంత గురుతరమైన బాధ్యత ఉంది. పాఠశాలలకు వచ్చే గ్రామీణ, బడుగు వర్గాల పిల్లలు తమ సహజమైన తెలంగాణ మాండలికంలో మాట్లాడినప్పుడు 'ఇది అశుద్ధమైన యాస, ఇలా మాట్లాడకూడదు' అని దండించడం లేదా హేళన చేయడం వారిలోని ఆత్మస్థైర్యాన్ని, సృజనాత్మకతను నిర్దాక్షిణ్యంగా దెబ్బతీస్తుంది. ప్రామాణిక తెలుగులోని రచనా నియమాలను విద్యార్థులకు నేర్పిస్తూనే, వారి ఇంటి భాషను, ప్రాంతీయ నుడికారాన్ని ఆత్మీయంగా గౌరవించే సున్నితమైన బోధనా పద్ధతులు విస్తృతంగా అమలులోకి రావాలి. మాతృభాషపై పరిపూర్ణమైన ప్రేమ, పట్టు ఉన్నప్పుడే ఇతర ప్రపంచ భాషలను సులువుగా నేర్చుకోగల బహుభాషా విజ్ఞానం పెంపొందుతుంది. ఆధునిక ప్రపంచీకరణ, విపరీత పట్టణీకరణ, ఆంగ్ల మాధ్యమ వ్యామోహం, డిజిటల్ సంక్షిప్త సందేశాల యుగంలో అన్ని ప్రాంతీయ మాతృభాషలు పెను సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణమిది. ఉపాధి కోసం ఆంగ్లం, జాతీయ స్థాయి అవసరాల కోసం హిందీ లేదా ఇతర భాషలు నేర్చుకోవడం తప్పనిసరి అయినప్పటికీ, వాటి కోసం స్వంత భాషను విస్మరించడం ఆత్మహత్యా సదృశం. లోకాన్ని జయించడానికి ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు గానీ, మన మూలాలను, మన సాంస్కృతిక అస్తిత్వాన్ని గుర్తించడానికి, అంతరంగాన్ని నిష్కల్మషంగా వ్యక్తీకరించడానికి మాతృభాష ఒక్కటే అసలైన సాధనం.

తెలంగాణ నేల భాషను భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడానికి సమష్టి కార్యాచరణ అత్యవసరం. పల్లెల్లో అంతరించిపోతున్న వ్యవసాయ, చేతివృత్తుల, జీవన అనుబంధ అపురూప పదజాలాన్ని పండితులు, పరిశోధకులు క్షేత్రస్థాయికి వెళ్లి శాస్త్రీయంగా నమోదు చేయాలి. వృద్ధుల నోటి నుంచి జాలువారే సామెతలు, పొడుపు కథలు, వైద్య విధానాలు, జానపద కథాగేయాలను ఆధునిక డిజిటల్ శ్రవ్య–దృశ్య రూపాల్లో భాండాగారాలుగా భద్రపరచాలి. తెలంగాణలోని అన్ని జిల్లాల మాండలిక పదకోశాలను, వృత్తి పదకోశాలను విశ్వవిద్యాలయాలు ప్రతిష్ఠాత్మకంగా రూపొందించాలి. నేటి ఆధునిక సాంకేతిక విప్లవంలో భాగంగా కృత్రిమ మేధస్సు (ఏఐ), సహజ భాషా విశ్లేషణ (ఎన్ఎల్‌పీ), వాయిస్ రికగ్నిషన్, స్వయం అనువాద సాఫ్ట్‌వేర్లలో తెలంగాణ విలక్షణ పదసంపదకు, ఉచ్చారణా శైలికి తగిన స్థానం కల్పించేలా సాంకేతిక పరిశోధనలు ముమ్మరం కావాలి. నవతరం రచయితలు, కళాకారులు తెలంగాణ జీవితాన్ని కృత్రిమత్వం లేకుండా తెలంగాణ పలుకుబడితోనే నవ్య సాహిత్యంగా ఆవిష్కరించాలి. పత్రికలు, దృశ్యమాధ్యమాలు ఈ భాషను కేవలం హాస్యానికి మాత్రమే పరిమితం చేయకుండా గంభీర విశ్లేషణలకు, సంపాదకీయాలకు సైతం సమర్థవంతంగా వినియోగించాలి.

భాషను బతికించేది కేవలం ప్రభుత్వ ఉత్తర్వులో, తాత్కాలిక సభాప్రాంగణాలో కావు; సమాజం తన భాష పట్ల ప్రదర్శించే నిరంతర స్వాభిమానం, ఆచరణాత్మక వినియోగం మాత్రమే దానిని సజీవంగా ఉంచుతాయి. ఒక మనిషి తన తల్లి ప్రేమామృతాన్ని ఎలా మరచిపోలేడో, ఒక సమాజం తన పురిటిగడ్డ భాషను అలా విస్మరించకూడదు. భాషను కాపాడుకోవడం అంటే ప్రాచీన అక్షరాలను భద్రపరచడం మాత్రమే కాదు; ఆ పదాల మాటున తరతరాలుగా నిక్షిప్తమై ఉన్న ఆచార వ్యవహారాలను, పోరాట వీరత్వాన్ని, త్యాగాలను, కన్నీటి గాథలను, జీవన మూలాలను కాపాడుకోవడమే. 'మాట మనది, మట్టి మనది, మనుగడ మనది' అనే ప్రగాఢ ఆత్మవిశ్వాసంతో తెలంగాణ పలుకుబడిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, ప్రపంచ భాషా వేదికలపై సగర్వంగా నిలబెట్టడమే కాళోజీ నారాయణరావుకు మనం అర్పించే నిజమైన నివాళి, తెలంగాణ భాషా దినోత్సవానికి నిండైన సార్థకత.




రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఇండియాతో చారిత్రాత్మక పోరుకు జపాన్ జట్టు ప్రకటన





ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్, ఐసీసీ నంబర్ వన్ ర్యాంకర్ అయిన టీమ్ ఇండియాతో సెప్టెంబర్ 22న టోచిగిలోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే చారిత్రాత్మక టీ20 సమరానికి జపాన్ క్రికెట్ బోర్డు.. తమ జట్టును అధికారికంగా అనౌన్స్ చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నివేదిక ప్రకారం, ఈ మ్యాచ్ ముగిసిన రెండు రోజులకే నగోయాలో ఆరంభమయ్యే స్వదేశీ ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన స్క్వాడ్‌నే ఈ మ్యాచ్ బరిలోకి దించుతున్నారు. జపాన్ తరఫున అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడు కెండల్ కడోవాకి-ఫ్లెమింగ్ ఈ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. అతడితో పాటు 50కి పైగా టీ20 మ్యాచ్‌లు ఆడిన అనుభవజ్ఞులైన ఇబ్రహీం తకాహాషి, డెక్లాన్ సుజుకి-మెక్‌కాంబ్ జట్టులో కీలకం కానున్నారు. ఆసియా క్రీడల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని ఈ జట్టును సెలెక్ట్ చేయడంతో, ఐసీసీ అర్హత ఉన్నప్పటికీ గేమ్స్ నిబంధనల పరిధిలోకి రాని కొంతమంది ఆటగాళ్లను తప్పించాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఈ పరిణామం దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన యువ స్పిన్ ఆల్‌రౌండర్ జేక్ కుసుడ-నైర్న్‌కు మార్గం సుగమం చేసింది. 2013లో మొదటిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ ఆటగాడు సుయోషి తకాడా మళ్లీ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. స్కూల్ క్రికెట్ బుకాట్సు ప్రోగ్రామ్‌ల ద్వారా వెలుగులోకి వచ్చిన వతారు మియాచి, మకోటో తానియామాలు ఈ లైనప్‌లో చోటు దక్కించుకున్నారు. ఆస్ట్రేలియా దిగ్గజం షేన్ వార్న్ బౌలింగ్ వీడియోలు చూస్తూ లెగ్ స్పిన్ నేర్చుకున్న తానియామా, తన ఆరాధ్య క్రికెటర్ జెర్సీ నంబర్ 23 ధరించి ఆడనున్నారు. ఈ అరుదైన మ్యాచ్ భారత్, జపాన్ దేశాల ద్వైపాక్షిక సంబంధాల 75 సంవత్సరాల వేడుకల్లో భాగంగా 'స్పోర్ట్ 75' పేరుతో నిర్వహిస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఇరు దేశాల ప్రజల మధ్య క్రీడా సంబంధాలను విస్తరించడానికి ఈ వేదిక ఉపయోగపడనుంది. భారత్‌తో పోరుకు ముందు జపాన్ సెప్టెంబర్ 19, 20 తేదీల్లో హాంకాంగ్‌తో రెండు టీ20లలో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లో భాగంగా సెప్టెంబర్ 24న అఫ్గానిస్తాన్, 26న నేపాల్‌తో తలపడనుంది. మరోవైపు టీమ్ ఇండియా ఈ చారిత్రక పోరు కోసం శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివం దూబే, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీలతో కూడిన దుర్భేద్యమైన జట్టును ప్రకటించింది.



## భారత్ ను చూసి నేర్చుకోండి

**ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ సూచన**

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న జట్టు నుంచి ఏడుమంది ప్లేయర్లు, ఇద్దరు కోచ్‌లను ఆకస్మికంగా స్వదేశానికి రప్పించాలన్న బోర్డు నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలోనే ఆయన సెలెక్టర్ పదవికి సైతం రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సెలెక్షన్ కమిటీ సభ్యులందరికీ పీసీబీ షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై మిస్బా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతికూల పరిస్థితులలో కూడా హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించడం సరికాదని అన్నారు. ఓటమి ఎదురైన ప్రతిసారీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దకుండా తాత్కాలిక మార్పులకే బోర్డు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. విదేశాల నుంచి వచ్చే కోచ్‌లకు బోర్డు అపరిమితమైన అధికారాలను ఇస్తోందని, ఒకవేళ జట్టు విఫలమైనా వారిపై ఎలాంటి బాధ్యతను మోపట్లేదని మండిపడ్డారు. అదే సమయంలో సొంత కోచ్‌లకు మాత్రం కనీస మద్దతు ఇవ్వట్లేదని, ప్రతి చిన్న దానికి వారిని బోనులో నిలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను విదేశీ కోచ్‌ల నియామకాన్ని తప్పుబట్టట్లేదని, విదేశీ కోచ్‌ల పట్ల కొంత సాఫ్ట్ కార్నర్ ఉంటోందని వ్యాఖ్యానించారు. అదే స్థానిక కోచ్‌ల విషయానికి వస్తే ప్రతి ఒక్కరూ వారిని విమర్శించడమే పనిగా పెట్టుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా భారత క్రికెట్ బోర్డు అనుసరిస్తోన్న విధానాలను మిస్బా ఉదహరించారు. భారత జట్టు ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానంలో కొనసాగడం వెనుక దశాబ్దాల కఠోర శ్రమ ఉందని అన్నారు. 1990ల నుంచి భారత్ తమ క్రికెట్ నిర్మాణంపై దృష్టి పెడుతూ వచ్చిందని, దాని ఫలితాల వల్లే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి గొప్ప ఆటగాళ్లు పుట్టుకొచ్చారని గుర్తుచేశారు. పాకిస్తాన్ క్రికెట్‌లో ప్రస్తుతం యువ ఆటగాళ్లకు టెస్ట్ క్రికెట్ ఆడే అవకాశం చాలా తక్కువగా లభిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నేటి తరం ఆటగాళ్లు ఎక్కువగా పరిమిత ఓవర్ల క్రికెట్‌కే ప్రాధాన్యత ఇస్తోన్నారని, దీనివల్ల టెస్ట్ ఫార్మట్ లో రాణించే నైపుణ్యాలు కొరవడుతున్నాయని విశ్లేషించారు. ఒత్తిడిని తట్టుకోలేకపోవడానికి ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడకపోవడమే కారణమని చెప్పారు. పాకిస్తాన్ క్రికెట్ పూర్వవైభవాన్ని సంతరించుకోవాలంటే పీసీబీ తన విధానాలను మార్చుకోవాల్సి ఉంటుందని మిస్బా సూచించారు. ఆకస్మిక మార్పులతో ఆటగాళ్లలో భయాందోళనలు పెరుగుతాయే ఒరిగేదేమీ ఉండదని, యువ ఆటగాళ్లకు ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడేలా ప్రోత్సహించాలని చెప్పారు.

# రూమర్లకు చెక్ పెట్టిన రాహుల్..





ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 మినీ వేలానికి ముందు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ భవితవ్యంపై నెలకొన్న ఎండ్ కార్డు పడింది. గత 2026 సీజన్ ముగిసిన నాటి నుంచి ఫ్రాంచైజీల మధ్య ఆటగాళ్ల ట్రేడింగ్ గురించి పలు రకాల ప్రచారాలు జరిగాయి. ఇప్పటికే రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ గూటికి చేరగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వెళ్లే భారీ ట్రేడ్ అధికారికంగా స్పష్టమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాహుల్ కూడా వేరే ఫ్రాంచైజీలోకి వెళ్తాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే రాబోయే సీజన్‌లో తాను ఢిల్లీ క్యాపిటల్స్ తరఫునే బరిలోకి దిగుతానని రాహుల్ స్వయంగా తేల్చిచెప్పాడు. ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ సోషల్ మీడియా వేదికగా రాహుల్‌ను ప్రశంసిస్తూ పెట్టిన పోస్ట్‌తో ఈ చర్చలకు తెరపడింది. రాహుల్‌ను అత్యుత్తమ క్లచ్ ప్లేయర్‌గా అభివర్ణించిన జిందాల్, ఫ్రాంచైజీతో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని రాసుకొచ్చాడు. "కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు నిజమైన ఆస్తి. జట్టు ప్రయోజనాలను ఎల్లప్పుడూ ముందుంచే వ్యక్తి. రాబోయే సీజన్‌లో ఢిల్లీని గర్వపడేలా చేయడానికి కలిసి శ్రమిస్తాం" అని జిందాల్ పేర్కొన్నాడు. దీనికి రాహుల్ స్పందిస్తూ "థ్యాంక్స్, వచ్చే సీజన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని బదులిచ్చాడు. దీంతో అతడు ఢిల్లీ క్యాపిటల్స్ జెర్సీలోనే కొనసాగుతాడన్న విషయం అధికారికంగా రూఢీ అయింది. 2025 సీజన్‌లో రూ. 14 కోట్లకు ఢిల్లీలో చేరిన రాహుల్, తొలి ఏడాది 539 రన్స్, 2026 సీజన్‌లో 593 రన్స్ చేసి అద్భుత ఫామ్ కనబరిచాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ వ్యవహారంలో కీలక మలుపు తిరిగింది. సరైన డీల్ కుదరకపోవడంతో హార్దిక్ మరో ఏడాది పాటు ముంబై ఇండియన్స్ జట్టులోనే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 2027 సీజన్ కోసం జట్టు నాయకత్వంలో మార్పులు జరగనున్నాయని, కొత్త కెప్టెన్ ఎంపిక ప్రక్రియలో మాజీ సారథి రోహిత్ శర్మ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాడని తెలుస్తోంది. కెప్టెన్సీ కోల్పోయినప్పటికీ హార్దిక్ జట్టులో ఒక ఆటగాడిగా కొనసాగే అవకాశాలను ఫ్రాంచైజీ పరిశీలిస్తోంది. ఫ్రాంచైజీలు తమ కోర్ గ్రూప్‌ను పటిష్టం చేసుకునే క్రమంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. రిషభ్ పంత్ రీఎంట్రీ, రాహుల్ కొనసాగింపుతో ఢిల్లీ క్యాపిటల్స్ మరింత బలంగా మారగా, మిగిలిన జట్లు సైతం సమతుల్యత కోసం ట్రేడింగ్ మార్గాలను అన్వేషిస్తున్నాయి.



## పట్టుబిగించిన ఈస్ట్ జోన్..

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటి కొండంత స్కోర్ చేసిన ఈస్ట్ జోన్.. ఆ తర్వాత బౌలింగ్‌తో సౌత్ జోన్ పని పట్టింది. దాంతో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈస్ట్ జోన్ బౌలర్లు మహమ్మద్ షమీ(2/17), ముఖేష్ కుమార్(2/36) నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులే చేసింది. క్రీజులో తిలక్ వర్మ(133 బంతుల్లో 5 ఫోర్లతో 56 బ్యాటింగ్), సీవీ మిలింద్(2 బ్యాటింగ్) ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ కుమార్‌తో పాటు ఖురైషి, శిఖర్ మోహన్ తలో వికెట్ తీసారు. సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల వెనుకంజలో ఉంది. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 708 పరుగుల భారీ స్కోర్‌ను అధిగమించేందుకు మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై సౌత్ జోన్ బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. ఓపెనర్ రికీ భుయ్(1) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. నారయణ్ జగదీషన్, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడారు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నారయణ్ జగదీషన్(32)ను శిఖర్ మోహన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరోవైపు షేక్ రషీద్‌తో కలిసి పడిక్కల్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో సౌత్ జోన్ 115/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే షేక్ రషీద్(27)ను మహమ్మద్ షమీ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా.. సెంచరీ దిశగా సాగిన పడిక్కల్‌ను ముఖేష్ కుమార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 3 పరుగుల వ్యవధిలోనే సౌత్ జోన్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, రవిచంద్రన్ స్మరణ్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని షమీ విడదీసాడు. రవిచంద్రన్(23) కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం శ్రేయస్ గోపాల్ క్రీజులోకి రాగా.. తిలక్ వర్మ ఆచితూచి ఆడటంతో సౌత్ జోన్ 176/5 టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో సమయోచితంగా బ్యాటింగ్ చేసిన ఈ జోడీ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో తిలక్ వర్మ 123 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన శ్రేయస్ గోపాల్‌ను ఖురైషి ఔట్ చేసి ఆరో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. చామ మిలింద్‌తో కలిసి తిలక్ వర్మ ఒంటరి పోరాటం చేశాడు. అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. మరో వికెట్ పోకుండా మూడో రోజు ఆటను ముగించాడు.



# నగ్నంగా నిలబెట్టేవారు..

సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్, నటి సందీపా విర్క్ తన జీవితంలో ఎదుర్కొన్న అత్యంత భయానకమైన దినాలను గుర్తుచేసుకుని తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రూ.6 కోట్ల మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి సందీపా విర్క్ దాదాపు నాలుగున్నర నెలల పాటు ఢిల్లీలోని తీహార్ జైలులో గడపాల్సి వచ్చింది. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న సందీపా విర్క్.. జైలులో తాను అనుభవించిన దారుణ పరిస్థితులను, అవమానాలను బయటపెట్టారు. జైలులో ఖైదీలను తనిఖీ చేసే పద్ధతి అత్యంత అమానుషంగా ఉంటుందని సందీపా చెప్పుకొచ్చారు. లోపలికి వెళ్లగానే సిబ్బంది బట్టలు విప్పించి ప్రైవేట్ పార్టులపై టార్చ్ లైట్ వేసి తనిఖీ చేస్తారని.. చలికాలంలోనూ ఇష్టారీతిన దుస్తులు తొలగించి అవమానిస్తారని వాపోయారు. ఇంత కఠినంగా శరీరాన్ని తనిఖీ చేస్తున్నప్పుడు జైలు లోపలికి మొబైల్ ఫోన్లు, డ్రగ్స్ ఎలా వస్తున్నాయని ఆమె ప్రశ్నించారు. జైలులో డబ్బు ఉంటే ఏదైనా సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక రోజులోనే రెండు మూడు సార్లు దుస్తులు ఊడదీసి తనిఖీలు చేసేవారని.. ఆ వందలాది తనిఖీల సమయంలో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని సందీపా విర్క్ వెల్లడించారు. “మహిళా సిబ్బందే కదా చూస్తోంది, దుస్తులు తీస్తే తప్పేంటి?” అని కొందరు తేలికగా మాట్లాడుతున్నారని సందీపా విర్క్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా జైలులోని ఆహారం, టాయిలెట్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండేవని.. మొదటిరోజే తనను 25-26 మంది ఉన్న గదిలో నెట్టివేశారని సందీపా విర్క్ గుర్తుచేసుకున్నారు. నిరంతం జరిగిన మానసిక వేధింపులు, ఒత్తిడి తట్టుకోలేక తాను జైలులో ఉన్న సమయంలో ఆత్మహత్య చేసుకోవాలని కూడా భావించినట్లు కన్నీటిపర్యంతమయ్యారు.

# మోక్షజ్ఞ బర్త్ డేకి ఫ్యాన్స్‌కి ట్రీట్..

గోపీచంద్ మలినేని దర్శకత్వంలో గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ నటిస్తోన్న ఎన్‌బీకే 111 మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. గత కొంతకాలంగా ఎన్‌బీకే 111 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు తాజాగా టైటిల్ ఖరారు చేశారు. బాలయ్య కుమారుడు నందమూరి మోక్షజ్ఞ తేజ పుట్టినరోజును పురస్కరించుకుని టైటిల్‌ను రివీల్ చేశారు. బాలయ్య – గోపీచంద్ మలినేని మూవీకి దాదా అనే టైటిల్‌ను కన్ఫర్మ్ చేస్తూ మేకర్స్ పోస్టర్ విడుదల చేశారు. దీనికి సంబంధించి పోస్ట్ వైరల్ అవుతోంది. వీరశివారెడ్డి వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత నందమూరి బాలకృష్ణ- గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మూవీ కావడంతో ఎన్‌బీకే 111పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటి వరకు ఈ సినిమాకు టైటిల్ ఏంటన్నది మాత్రం నిర్మాతలు ప్రకటించలేదు. అయితే అభిమానుల ఎదురుచూపులకు తెరదించుతూ.. సెప్టెంబర్ 6వ తేదీన ఎన్‌బీకే 111 టైటిల్‌ను రివీల్ చేశారు. ఈ మేరకు దాదా పేరుతో టైటిల్ గ్లింప్స్ విడుదల చేశారు. బాలయ్య స్టైలిష్‌గా ఎంట్రీ ఇచ్చారు. సూపర్‌స్టార్ కృష్ణ హిట్ మూవీ అగ్నిపర్వతంలోని పాపులర్ డైలాగ్ అగ్గి పెట్టుందా అని అడుగుతూ పూనకాలు తెప్పించారు బాలయ్య. అరేయ్ ఏరే.. నాకు గురిపెట్టడానికి ఒంటిలో పొగరు, వేలికి ట్రిగ్గరు ఉంటే సరిపోదు, బుల్లెట్స్‌కి బలుపుండాలి, గన్స్‌కి గట్స్ ఉండాలి అంటూ తన మార్క్ పంచ్ డైలాగ్‌తో అభిమానులను అలరించారు. దాదాలో బాలయ్య సరసన కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలయ్యను ఢీకొట్టే పవర్‌ఫుల్ విలన్‌గా హీరో మంచు మనోజ్ కనిపించనున్నారు. మిగిలిన నటీనటుల వివరాలు తెలియాల్సి ఉంది. ఇటీవల పెద్దితో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ప్రముఖ నిర్మాత వెంకట సతీశ్ కిలారు తన వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై దాదా సినిమాను నిర్మిస్తున్నారు. బాలయ్య ఫేవరెట్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తుండగా.. కాంతార ఫేమ్ అరవింద్ ఎస్ కశ్యప్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. బుర్రా సాయి మాధవ్ తన మార్క్ పంచ్ డైలాగులను రాస్తున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న దాదా విడుదల కానుందని మేకర్స్ ప్రకటించారు. దాదా సినిమా షూటింగ్ సమయంలో నందమూరి బాలకృష్ణకు గాయం కావడంతో ఆయన ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆయన కోలుకోవడంతో వచ్చే నెల నుంచి షూటింగ్‌ను తిరిగి ప్రారంభించి.. నాన్‌స్టాప్ షెడ్యూల్స్‌తో శరవేగంగా కంప్లీట్ చేయాలని గోపీచంద్ మలినేని భావిస్తున్నారు. షూటింగ్‌కు 2 నెలలే సమయం ఉండటంతో దానికి తగిన విధంగా షూటింగ్ ప్లాన్ చేస్తున్నారని సినీ వర్గాలు తెలిపాయి.



# ‘ఫౌజీ’ సెట్‌లో ప్రమాదం జరగలేదు



ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా ‘సీతా రామం’ వంటి విజయం తర్వాత హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న సినిమా ‘ఫౌజీ’ . ఆల్రెడీ విడుదలైన ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. సినిమాపై పాజిటివ్ బజ్ నెలకొంది. అది పక్కన పెడితే... కొన్ని నెలల క్రితం ఈ సినిమా షూటింగ్ చేసేటప్పుడు బాలీవుడ్ నటుడు రాజేష్ శర్మను ఓ కీటకం (విష పురుగు) కుట్టడంతో అనారోగ్యానికి గురి అయ్యారని, ఆయన ఆసుపత్రి పాలయ్యారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. ఆ వార్తల్లో నిజం లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అసలు నిజాలను బయట పెట్టారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రభాస్ సినిమా ‘ఫౌజీ’ షూటింగ్ పూర్తి చేసుకుని దట్టమైన చెట్ల మధ్య టెక్నీషియన్లతో రాజేష్ శర్మ మాట్లాడుతున్న సమయంలో ఆయన్ను ఓ కీటకం కుట్టిందని జూలై నెలలో బెంగాలీ యాక్టర్ సుదీప ఛటర్జీ తెలిపారు. అప్పట్లో అది పెద్ద సమస్యగా అనిపించలేదని, దాంతో రాజేష్ శర్మ నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. చిత్రీకరణ ముగిసిన ఆరు గంటలకు కాలులో తీవ్రమైన నొప్పి కలగడంతో కోల్‌కతాకు ప్రయాణిస్తున్న విమానంలో రాజేష్ శర్మకు విపరీతమైన జ్వరం వచ్చిందని, పరిస్థితి విషమించడంతో కోల్‌కతాలోని మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించినట్లు సుదీప ఛటర్జీ వివరించారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన ఆరోగ్యంపై జరిగిన ప్రచారాన్ని రాజేష్ శర్మ ఖండించారు. తాను ‘ఫౌజీ’ సెట్స్‌లో అనారోగ్యానికి గురైనట్లు వచ్చిన వార్తల్లో అసలు నిజం లేదని ఆయన తెలిపారు. ఆ అంశం గురించి రాజేష్ శర్మ మాట్లాడుతూ... ‘‘అది ముమ్మాటికీ అబద్ధమే. ప్రభాస్ ‘ఫౌజీ’ సినిమా సెట్స్‌లో నాకు ఏం జరగలేదు. నేను అనారోగ్యానికి గురి కావడం వెనుక ప్రభాస్ కానీ, ఆయన సినిమా యూనిట్ కానీ ఎంత మాత్రం బాధ్యులు కారు. వాళ్ళందరూ మంచి వ్యక్తులు” అని చెప్పారు. హైదరాబాద్‌లో షూటింగ్ చేసిన సమయంలో తనకు ఎటువంటి ఇబ్బంది తలెత్తలేదని, కోల్‌కతాకు వచ్చిన ఒకట్రెండు రోజుల తర్వాతే పరిస్థితి విషమించిందని... తీవ్రంగా మారిందని రాజేష్ శర్మ వివరించారు. తాను అనారోగ్యానికి గురి కావడానికి అసలు కారణం పురుగు కుట్టడం కాదని, తన కుడి కాలును చాలా కాలంగా ఇబ్బంది పెడుతున్న చర్మ సంబంధిత సమస్య అని, దాని కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకిందని రాజేష్ శర్మ వెల్లడించారు. తనకు షుగర్ (డయాబెటిస్) ఎక్కువగా ఉండటం, సమస్యను ప్రారంభంలో పట్టించుకోకపోవడం వల్ల ఇన్‌ఫెక్షన్ మరింత ఎక్కువైందని ఆయన వివరించారు. సుదీప తనకు ఫ్రెండ్ అని, తప్పుడు సమాచారం అందడంతో అలా చెప్పారని పేర్కొన్నారు. అదీ సంగతి. ప్రస్తుతం తాను కోలుకుంటున్నానని రాజేష్ శర్మ తెలిపారు. మరో వారంలో తిరిగి షూటింగ్లు చేయడం స్టార్ట్ చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఢిల్లీకి వీడ్కోలు

**జాతీయ చలనచిత్ర అవార్డుల వేదికలో కీలక మార్పు**

**దేశవ్యాప్తంగా అవార్డుల నిర్వహణ**

**గుజరాత్‌లో 72వ అవార్డుల వేడుక**

**రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవ వేదిక విషయంలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా ఢిల్లీకే పరిమితమైన ఈ ప్రతిష్టాత్మక వేడుకను ఇకపై ప్రతి సంవత్సరం దేశంలోని వేర్వేరు ప్రాంతాలలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ‘ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్’ స్ఫూర్తిని చాటేందుకు ఈ మార్పు చేసినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవాన్ని సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని ఏక్తా నగర్ (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణం) లో వైభవంగా నిర్వహించనున్నారు. సాంప్రదాయబద్ధంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే ఈ వేడుకను ఇతర ప్రాంతానికి మార్చడం ఇదే తొలిసారి. 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా ‘ఆర్టికల్ 370’, ఉత్తమ నటిగా యామీ గౌతమ్ నిలవగా, మమ్ముట్టి మరియు కార్తీక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుడు పురస్కారాన్ని దక్కించుకున్నారు. అలాగే నాన్-ఫీచర్ విభాగంలో ఆనంద్ ఎల్ రాయ్ ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. సెప్టెంబర్ 22న గుజరాత్‌లో జరగనున్న ఈ ప్రత్యేక వేడుకలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు పురస్కారాలను అందజేయనున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**